# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ ఆదివారం 3-3-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :30 సంచిక:168 పేజీలు:6 వెల: రూ.1/-


## మళ్లీ వారణాసి నుంచి ప్రధాని నరేంద్ర మోదీ పోటీ.. ప్రకటించిన బీజేపీ

న్యూఢిల్లీ, మార్చి 2:రాబోయే లోక్‌సభ ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి వారణాసి లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేయనున్నారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్‌డే పోటీ ప్రకటించారు. ఎన్నికల కోసం 195 మంది అభ్యర్థులతో పార్టీ తన తొలి జాబితాను ప్రకటించింది. ఇందులో 34 మంది మంత్రులు ఉన్నారు. ప్రధాని మోదీ వారణాసి నుంచి పోటీ చేయడం ఇది మూడోసారి. 2014లో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌ను ఓడించి, 2019లో సమాజ్‌వాదీ పార్టీకి చెందిన షాలినీ యాదవ్‌పై విజయం సాధించారు. అభ్యర్థులను ఖరారు చేసేందుకు ఈ వారం ప్రారంభంలో ప్రధాని మోదీ తన నివాసంలో సమావేశం నిర్వహించింది. ఈ క్రమంలోనే బీజేపీ అభ్యర్థులను ప్రకటించింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి ఎన్నికల్లో పోటీ చేస్తారని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్‌డే వెల్లడించారు.ప్రధాని నరేంద్ర మోదీ వరుసగా మూడోసారి వారణాసి లోక్‌సభ స్థానం నుంచి ఆయన బరిలోకి దిగనున్నారు. వరుసగా ఇదే స్థానం నుంచి హ్యాట్రిక్ కొట్టాలని ఆయన భావిస్తున్నారు. తొలిసారిగా ఆయన 2014 సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా లోక్‌సభ బరిలోకి దిగారు. అంతకు ముందు గుజరాత్ ముఖ్యమంత్రిగా కొనసాగిన విషయం తెలిసిందే. 2001లో కేశుభాయ్ పటేల్ స్థానంలో తొలిసారిగా గుజరాత్ ముఖ్యమంత్రిగా మోదీ నియామకమయ్యారు. 2002, 2007, 2012లో నాలుసార్లు ముఖ్యమంత్రిగా రికార్డు విజయం సాధించారు. 2013 లో భారతీయ జనతా పార్టీ పార్లమెంటరీ పార్టీ బోర్డులో సభ్యుడిగా నియామకమయ్యారు. భారతీయ జనతా పార్టీ ఎన్నికల ప్రచార కమిటీ సారథ్య బాధ్యతలు స్వీకరించారు. 2014 సాధారణ ఎన్నికల్లో ప్రధాని మోదీ 371,784 ఓట్ల తేడాతో ఆప్ అధినేత అరవింద్ కేజ్రీవాల్‌పై విజయం సాధించారు. మోదీకి 581,022 ఓట్లు, అరవింద్ కేజ్రీవాల్‌కు 2,09,238 ఓట్లు వచ్చాయి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేశారు. ఈ ఎన్నికల్లో నరేంద్ర మోదీ 4,79,505 ఓట్ల తేడాతో విజయం సమీప ప్రత్యర్థి అయిన సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి షాలిని యాదవ్‌పై గెలుపొందారు. ఈ ఎన్నికల్లో మోదీకి 6,74,664 ఓట్లు పోలయ్యాయి. సమాజ్‌వాదీ పార్టీ అభ్యర్థి షాలినికి 1,95,15 ఓట్లు వచ్చాయి.

## పారిశ్రామికవేత్తలకు తెలంగాణ భూతల స్వర్గం.. ఉప ముఖ్యమంత్రి భట్టి




హైదరాబాద్, మార్చి 2 :పారిశ్రామికవేత్తలకు తెలంగాణ రాష్ట్రం భూతల స్వర్గం అని తెలిపారు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క. దేశంలో ఎక్కడా లేని మౌలిక వసతుల కల్పనకు మంచి వాతావరణం తెలంగాణ రాష్ట్రంలో నెలకొందన్నారు. రకరకాల ప్రాంతాల నుంచి వచ్చి హైదరాబాదులో స్థిరపడి ఆరోగ్యాన్ని బాగు చేసుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ అంటేనే నా రాష్ట్రం.. నా ఊరు అన్న భావన ఇక్కడ కలుగుతుందన్నారు. ప్రపంచానికి అద్భుతమైన మానవ వనరులను అందిస్తున్నది తెలంగాణ రాష్ట్రం అన్నారు. హైదరాబాద్ లోని హైటెక్ సిటీలో ఇవాళ జరిగిన సిఐఐ తెలంగాణ స్టేట్ అన్యువల్ మీటింగ్ 2023-24 కాన్ఫరెన్స్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా భట్టి విక్రమార్క హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణలో పెట్టుబడులు పెట్టడానికి వచ్చే పారిశ్రామికవేత్తలకు కాంగ్రెస్ ప్రభుత్వం రాయితీలు ఇవ్వడంతో పాటు పూర్తి సహకారం అందించడానికి సంసిద్ధతగా ఉందన్నారు. ఇందిరమ్మ రాజ్యం లోని కాంగ్రెస్ ప్రభుత్వం పరిశ్రమల స్థాపనకు ప్రోత్సాహం అందిస్తుందన్నారు.

### మహిళలను మహాలక్ష్మిగా చూసే ప్రభుత్వం మాది..

తెలంగాణలోని మహిళలను కాంగ్రెస్ ప్రభుత్వం మహాలక్ష్మిగా చూస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలులో మహాలక్ష్మి పథకం కింద మహిళలు అందిస్తున్న ఉచిత బస్సు రవాణాను ఇప్పటి వరకు 18.50 కోట్ల మంది మహిళలకు జీరో టికెట్స్ ఇచ్చామన్నారు. రాష్ట్రంలో పరిశ్రమల స్థాపనకు కొత్త ఇండస్ట్రీ పార్కుల ఏర్పాటుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రణాళికలను తయారు చేస్తున్నామన్నారు. మహిళా పారిశ్రామికవేత్తలకు మా ప్రభుత్వం ప్రత్యేక ప్రోత్సాహం అందిస్తుందన్నారు.

### డెయిరీ పరిశ్రమలు స్థాపించండి..

రాష్ట్రంలో పాల ఉత్పత్తికి వినియోగం మధ్యన చాలా గ్యాప్ ఉందని, దీంతో డెయిరీ ని డెవలప్ కు తెలంగాణాలో మంచి అవకాశాలు ఉన్నాయని తెలిపారు. స్వచ్ఛమైన పాలను అందించగలిగే విధంగా డెయిరీ ఇండస్ట్రీని ఏర్పాటు చేసుకుంటే భవిష్యత్తుకు మేలు చేసిన వారం అవుతామని తెలిపారు. అత్యధిక ఉద్యోగ అవకాశాలు కల్పించడానికి అనువుగా ఉన్న చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటును కాంగ్రెస్ ప్రభుత్వం ప్రోత్సహిస్తుందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయ అనుబంధ పరిశ్రమల ఏర్పాటుకు పారిశ్రామికవేత్తలు ముందుకు రావాలన్నారు.

### వ్యవసాయ అనుబంధ సంస్థలకు ఉజ్వల భవిష్యత్ ..

మొక్కజొన్న, టమాట, మిర్చి, పత్తి తదితర వ్యవసాయ అనుబంధ పరిశ్రమలు ఏర్పాటు చేయడం వల్ల రైతులకు మేలు చేయడంతో పాటు ప్రజలకు నాణ్యమైన ఆహార ఉత్పత్తులను అందించవచ్చని తెలిపారు. వాణిజ్య పంటల ఉత్పత్తి ద్వారా రైతులు ఆర్థికంగా బలపడటంతో పాటు పరిశ్రమల యజమానులు సైతం ఆదాయం పొందవచ్చన్నారు. గోదావరి కృష్ణ నదులను మూసీకి అనుసంధానం చేసి స్వచ్ఛమైన నీరు పారే విధంగా మూసీ ప్రక్షాళన చేయబోతున్నామన్నారు.

### మూసీనది పరివాహక ప్రాంతాన్ని టూరిజం స్పాట్ గా అభివృద్ధి..

మూసీ పరివాహక ప్రాంతంలో చెక్ డ్యామ్, చిల్డ్రన్ పార్క్, ఫ్లై ఓవర్స్, ఎంటర్టైన్మెంట్, బోటింగ్ తదితర ఎసెట్స్ ను పిపిపి మోడల్ లో అభివృద్ధి చేయనున్నామని భట్టి చెప్పారు. గత ప్రభుత్వ చర్యలతో మూసీ రివర్ డ్రైనేజీగా మారిందన్నారు. ఔటర్ రింగు రోడ్డు రీజనల్ రింగ్ రోడ్ మధ్యన అనేక క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు. హైదరాబాద్ శివార్లలో గత ప్రభుత్వం 30 వేల ఎకరాల్లో ఫార్మాసిటీని ఒకే చోట ఏర్పాటు చేయడానికి తీసుకున్న నిర్ణయాన్ని రద్దుచేసి 3000ఎకరాల్లో అనేక చోట్ల ఫార్మా విలేజ్లు అభివృద్ధి చేస్తున్నామని తెలిపారు.

### గ్రానైట్ క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నాం..

ఔటర్ రింగ్ రోడ్ రీజినల్ రింగ్ రోడ్ మధ్యన టెక్స్టైల్ గ్రానైట్ ఐటీ సెక్టార్ మైన్ తదితర క్లస్టర్లను ఏర్పాటు చేయబోతున్నామని అన్నారు. పెరిగిన ధరలతో హైదరాబాదులో సామాన్యులు పేద మధ్యతరగతి ప్రజలు ఇంటి స్థలం కొనే పరిస్థితి లేదన్నారు. గత ప్రభుత్వాలు హైదరాబాదులోని బర్కత్ పుర, ఎస్ ఆర్ నగర్, కూకట్ పల్లిలో హౌసింగ్ బోర్డ్ ఏర్పాటు చేసి అభివృద్ధి చేసినట్టుగా కాంగ్రెస్ ప్రభుత్వం శాటిలైట్ టౌన్ షిప్స్ ఏర్పాటు చేయబోతున్నామన్నారు.

### విద్యావనరులు అధికంగా ఉన్న ఏకైక రాష్ట్రం ..

హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ఉస్మానియా యూనివర్సిటీ ఐఐటి లాంటి విద్యాసంస్థలు మానవనరులను హైదరాబాదులో అద్భుతంగా తీర్చిదిద్దుతున్నాయని తెలిపారు. హైదరాబాదుకు మణిహారంగా ఉన్న ఔటర్ రింగ్ రోడ్డు, అంతర్జాతీయ విమానాశ్రయం, పరిశ్రమలకు కావలసినంత భూమి తెలంగాణలో అందుబాటులో ఉందన్నారు. హైదరాబాదు నగర రాజ్యాంగ అభివృద్ధి చెందుతుందన్నారు. హైదరాబాదును మిగతా జిల్లాలతో కలుపుతూ రీజనల్ రింగ్ రోడ్ ఏర్పాటు చేయబోతున్నామని తెలిపారు.

## అంగన్వాడీల్లో గర్భిణులు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందేలా చర్యలు

### - ఆయా శాఖల అధికారులకు సిఎం రేవంత్ కీలక ఆదేశాలు జారీ



హైదరాబాద్ మార్చ్ 2 (ఎక్స్ప్రెస్ స్నేవ్ స్);: మహిళా, శిశు, దివ్యాంగులు, వృద్ధుల సంక్షేమ శాఖ అధికారులతో తెలంగాణ సచివాలయంలో శనివారం నాడు రాష్ట్ర ముఖ్య మంత్రి రేవంత్ రెడ్డి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రి సీతక్క, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత శాఖ అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశం దాదాపు గంట పాటు జరిగింది. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారు లకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అంగన్వాడీల్లో గర్భిణులు, బాలింతలకు సరైన పౌష్టికాహారం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశించారు. అంగన్వాడీల్లో పౌష్టికాహారం దుర్వినియోగం జరగకుండా లబ్ధిదారులకు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అంగన్వాడీ కేంద్రాల్లో సీసీ కెమెరాలు, బయోమెట్రిక్ విధానం ఏర్పాటును పరిశీలించాలని సూచిం చారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న అంగన్వాడీ కేంద్రాలకు సొంత భవనాల నిర్మాణాలపై దృష్టిసారిం చాలని సీఎం పేర్కొన్నారు. మొదటి ప్రాధాన్యతగా తీసుకుని భవన నిర్మాణాలు పూర్తి చేయాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ పరిధిలో మొబైల్ అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటుపై అధ్యయనం చేయాలని అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. అనంతరం ఇందిరమ్మ ఇండ్లపై అధికారులతో సీఎం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ సలహా దారు వేం నరేందర్ రెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి, సంబంధిత శాఖ అధికారులు హాజరయ్యారు.

## కాళేశ్వరం ప్రాజెక్ట్ భారీ నష్టానికి.. కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలి.. మంత్రి శ్రీధర్ బాబు




కరీంనగర్, మార్చి 2:కాళేశ్వరం ప్రాజెక్ట్ భారీ నష్టానికి కేసీఆర్ ప్రజలకు సమాధానం చెప్పాలని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. మంథనిలో గృహజ్యోతి కార్యక్రమంలో భాగంగా లబ్ధిదారులకు జీరో విద్యుత్ బిల్లును మంత్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ? అధికారంలో ఉండగా ఎందుకు కాళేశ్వరం ప్రాజెక్ట్ రక్షణ, మరమ్మత్తుల కోసం చర్యలు చేపట్టలేదో కేటీఆర్ ప్రజలకు చెప్పాలన్నారు. నాడు ప్రాజెక్టు రక్షణ విస్మరించి, నేడు రాజకీయంగా మన ప్రభుత్వంపై బురదజల్లేందుకు కాళేశ్వరం ప్రాజెక్టు సందర్శనకు కేటీఆర్, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు వెళ్లడాన్ని ప్రజలు గమనిస్తున్నారన్నారు.

ప్రాజెక్ట్ సందర్శనలో కనీసం భూనిర్వాసితుల సమస్యలపై మాట్లాడకపోవడం విచారకరమన్నారు. భారీ వ్యయంతో నిర్మించిన ప్రాజెక్టు ద్వారా ఈ ప్రాంత రైతులకు సాగునీరు అందించలేదన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ దెబ్బతిన్న తీరుపై రక్షణ చర్యల నిమిత్తం నేషనల్ డ్యామ్ సేఫ్టీ అధికారుల నిపుణులైన ఇంజనీర్ల సూచనలతో ప్రభుత్వం ముందుకెళుతుందని ఇప్పటికే సీఎం రేవంత్ రెడ్డి, భారీ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ కుమార్ రెడ్డి ప్రకటించారన్నారు. విడుతల వారీగా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలను తమ ప్రభుత్వం అమలు చేస్తూ ముందుకు సాగుతుందన్నారు.

## యాదాద్రి పేరును మార్చేస్తాం -మంత్రి కోమటిరెడ్డి

హైదరాబాద్, మార్చి 2 :రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రి పేరును మారుస్తామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. యాదాద్రి పేరును గతంలో ఉన్న యాదగిరి గుట్టగా మార్పు చేస్తామని చెప్పారు. దీనికి సంబంధించి త్వరలోనే జీవో ఇస్తామని తెలిపారు.

ఇప్పటికే ఇదే విషయమై స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య ప్రకటన చేశారు. తాజాగా మంత్రి కోమటిరెడ్డి మీడియాతో చిట్‌చాట్‌లో యాదాద్రి పేరుమార్పుపై స్పందించారు. భువనగిరి నుంచి పోటీ చేయమని పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీకి చెప్పానన్నారు. భువనగిరి, నల్లగొండ, ఖమ్మం పార్లమెంట్ స్థానాల్లో దక్షిణ భారతదేశంలోనే భారీ మెజార్టీతో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ కంటే రాహుల్ అత్యధిక ఓట్లతో గెలుస్తారని చెప్పారు.

## జాతీయస్థాయిలో తెలంగాణ ఆర్టీసీకి అవార్డుల పంట.

### -15న ఢిల్లీలో ప్రదానం చేయనున్న ఏఎస్ఆర్‌టీయూ

హైదరాబాద్ మార్చ్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ(టీఎస్ఆర్టీసీ)కి జాతీయ స్థాయి అవార్డుల పంట పండింది. కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ అయిన అసోసియేషన్ ఆఫ్ స్టేట్ రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ అండర్‌టేకింగ్స్ (ఏఎస ఆర్‌టీయూ) ప్రతి ఏటా అందించే ప్రతిష్టాత్మక నేషనల్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్సలెన్స్ అవార్డులు సంస్థకు వరించాయి. 2022-23 ఏడాదికి గానూ రహదారి భద్రత, ఇంధన సామర్థ్య నిర్వహణ, సిబ్బంది సంక్షేమం, సాంకేతికత వినియోగం, తదితర కేటగిరిల్లో ఈ జాతీయ స్థాయి పురస్కారాలు టీఎస్ఆర్టీసీకి దక్కాయి. రహదారి భద్రతలో ప్రథమ బహుమతి, ఇంధన సామర్థ్య నిర్వహణ మొఫిషిల్ విభాగంలో ప్రథమ, అర్బన్ విభాగంలో ద్వితీయ బహుమతిని టీఎస్ఆర్టీసీ కైవసం చేసుకుంది. సిబ్బంది సంక్షేమం, ఉత్పత్తి కేటగిరిలో ప్రథమ, సాంకేతికత ద్వారా ప్రయాణికులకు మెరుగైన సేవలందించినందుకు గాను మరో ప్రథమ బహుమతిని టీఎస్ఆర్టీసీ గెలుచుకుంది. ఐదు అవార్డులను న్యూఢిల్లీలో ఈ నెల 15న టీఎస్ఆర్టీసీ ఉన్నతాధికారులకు అందజేస్తున్నట్లు ఏఎస్ఆర్‌టీయూ ప్రకటించిం ది.టీఎస ఆర్టీసీ 5 జాతీయ స్థాయి అవార్డులు గెలుచుకోవడం పట్ల రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హర్షం వ్యక్తం చేశారు. సిబ్బంది నిబద్ధత, అంకితభావం, క్రమశిక్షణతో పనిచేయడం వల్లే సంస్థకు ఈ పురస్కారాలు దక్కాయని ఆయన అన్నారు. అవార్డులు వచ్చేలా కృషిచేసిన ఆర్టీసీ అధికారులు, సిబ్బందిని అభినందించారు.నేషనల్ బస్ ట్రాన్స్‌పోర్ట్ ఎక్సలెన్స్ అవార్డులను గెలుచుకోవడంతో ప్రజా రవాణా వ్యవస్థలో టీఎస్ఆర్టీసీ దేశానికే రోల్ మోడల్‌గా నిలిచిందని సంస్థ ఎండీ వీసీ సజ్జనర్ అన్నారు. సంస్థ అభివృద్ధికి, ప్రయాణికులకు మెరుగైన, నాణ్యమైన సేవలందించేందుకు అధికారులు, సిబ్బంది చేస్తున్న కృషికి ఈ అవార్డులు చిహ్నమని ఆయన తెలిపారు.

## 195 మంది అభ్యర్థులతో బిజెపి తొలి జాబితా విడుదల !




న్యూఢిల్లీ, మార్చి 2: లోక్‌సభ ఎన్నికలకు అభ్యర్థుల తొలి జాబితాను భాజపా విడుదల చేసింది. మొత్తం 195 స్థానాలకుగానూ పోటీదారుల పేర్లను పార్టీ జనరల్ సెక్రటరీ వినోద్ తావ్డే ప్రకటించారు..

ఈ లిస్ట్‌లో మొత్తం 34 మంది మంత్రులున్నారు. 57 మంది ఓబీసీలకు అవకాశమిచ్చింది హైకమాండ్. యువతకు 47 స్థానాలు కేటాయించినట్టు వినోద్ తావడే వెల్లడించారు. ఎస్సీలకు 27, ఎస్టీలకు 18 సీట్లు కేటాయించారు. మొత్తం అభ్యర్థుల్లో 28 మంది మహిళలకు అవకాశమిచ్చారు. బెంగాల్‌లో 20, మధ్యప్రదేశ్‌లో 24, గుజరాత్‌లో 15, రాజస్థాన్‌లో 15 మంది అభ్యర్థుల పేర్లను ప్రకటించారు. కేరళ 12 సీట్లు, తెలంగాణ 9 సీట్లు, అసోం 11, ఝార్ఖండ్ 11, ఛత్తీస్ గఢ్ 11, ఢిల్లీ 5 సీట్లు, జమ్మూ కశ్మీర్ 2, ఉత్తరాఖండ్, 2, అరుణాచల్ ప్రదేశ్, గోవా 1, త్రిపుర 1, అండమాన్ నికోబార్ 1, డామన్ డయ్యూ 1 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. అరుణాచల్ ప్రదేశ్ నుంచి కిరణ్ రిజిజు బరిలోకి దిగనున్నారు. లిస్ట్‌లో ప్రధాని నరేంద్ర మోదీ, అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ సహా మరి కొందరు కీలక నేతల పేర్లున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ మరోసారి వారణాసి నుంచే బరిలోకి దిగనున్నారు. ఎప్పటిలాగే అమిత్ షా గుజరాత్‌లోని గాంధీనగర్ నుంచి పోటీ చేయనున్నారు. దాదాపు 15 రోజులుగా ఈ జాబితాపై మేధోమథనం చేస్తోంది అధిష్ఠానం. ప్రధాని నరేంద్ర మోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, అమిత్ షా ప్రత్యేకంగా సమావేశమయ్యారు. జాబితాని పూర్తిగా పరిశీలించి ఆ తరవాత ఆమోద ముద్ర వేశారు. ఇప్పుడిదే లిస్ట్‌ని విడుదల చేశారు. ఈ సారి 370 స్థానాలు గెలుచుకోవాలన్న లక్ష్యంతో బరిలోకి దిగుతోంది బీజేపీ. అంతే కాదు. ఔఅం కూటమి 400 చోట్ల తప్పకుండా విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేస్తోంది. ముగ్గురు సిట్టింగ్ ఎంపీలు సికింద్రాబాద్ ఎంపీ జీ కిషన్‌రెడ్డి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్‌కు అవకాశం కల్పించింది. మల్కాజ్‌గిరి నుంచి ఈటెల రాజేందర్, హైదరాబాద్ మాధవీలత, భువనగిరి బూర నర్సయ్య గౌడ్, నాగర్ కర్నూల్ భరత్ ప్రసాద్, జహీరాబాద్ బీబీ పాటిల్, చేవెళ్ల కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి అవకాశం కల్పించింది.

## టీఎంసీ అంటే 'తూ, మైన్ ఔర్ కరప్షన్': ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, మార్చి 2: పశ్చిమబెంగాల్‌లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అవినీతిపై ప్రధాని నరేంద్రమోదీ తీవ్ర విమర్శలు గుప్పించారు. నదియా జిల్లాలోని క్రిష్ణనగర్‌లో శనివారం జరిగిన విజయ సంకల్ప సభలో ప్రధాని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన టీఎంసీ అంటే 'తూ, మైన్ ఔర్ కరప్షన్ (నువ్వు, నేను ఇంకా అవినీతి)' అని అభివర్ణించారు. సభకు వచ్చిన మిమ్మల్నందరినీ చూస్తుంటే వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో ఎన్‌డీఏ కూటమి 400కు పైగా లోక్‌సభ స్థానాలు గెలువడం ఖాయమనిపిస్తోందని అన్నారు.

అదేవిధంగా వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ పశ్చిమబెంగాల్‌లోని మొత్తం 42 సీట్లకు 42 సీట్లు గెలువాలని ప్రధాని మోదీ రాష్ట్ర బీజేపీ నాయకత్వానికి లక్ష్యం నిర్దేశించారు. రాష్ట్ర బీజేపీ కలిసికట్టుగా పనిచేసి లోక్‌సభ ఎన్నికల్లో క్లీన్ స్వీప్ చేయాలని పిలుపునిచ్చారు. అరాచకాలు, వారసత్వ రాజకీయాలు, విధ్వంసాలకు తృణమూల్ కాంగ్రెస్ పార్టీ పర్యాయపదమని ఆయన వ్యాఖ్యానించారు.

అలాగే సందేశ్‌ఖాలి ఉదంతాన్ని ప్రధాని మోదీ లేవనెత్తారు. రాష్ట్రంలో మహిళలకు అండగా నిలువాల్సిన ప్రభుత్వం అందుకు విరుద్ధంగా మహిళలపై అఘాయిత్యాలకు పాల్పడిన నిందితులకు వత్తాసు పలుకుతోందని విమర్శించారు. రాష్ట్రంలోని తల్లులు, చెల్లెల్లు న్యాయం కోసం అభ్యర్థిస్తుంటే ప్రభుత్వం వారి గోడును వినిపించుకోవడం లేదని మండిపడ్డారు. మహిళల సంక్షేమం పేరుతో ఓట్లు గుంజిన టీఎంసీ ఇప్పుడు మహిళలను ఏడిపిస్తోందని అన్నారు.

## మాజీ మంత్రి మల్లారెడ్డికి అధికారులు షాక్

### -హెచ్ఎండీఏ లే అవుట్‌లో మల్లారెడ్డి వేసిన రోడ్డు తొలిగింపు

హైదరాబాద్, మార్చి 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: మాజీ మంత్రి మల్లారెడ్డికి అధికారులు షాకిచ్చారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలో హెచ్ఎండీఏ లే అవుట్‌లో మల్లారెడ్డి వేసిన రోడ్డును అధికారులు తొలిగించారు. గుండ్ల పోచంపల్లి మున్సిపాలిటీలో హెచ్ఎండీఏ లే అవుట్‌లో 2500 గజాల భూమిని మల్లారెడ్డి ఆక్రమించి రోడ్డు నిర్మాణం చేశారు. కాలేజీ కోసం మాజీ మంత్రి రోడ్డును వేసుకున్నారు.

అయితే ఈ వ్యహారంపై గతంలో ఎంపీగా ఉన్న రేవంత్ రెడ్డి అధికారులకు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదు. ఇప్పుడు తాజాగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక భూమి అంశం మరోసారి తెరపైకి వచ్చింది.

మేడ్చల్ కలెక్టర్ ఆదేశాలతో ఈరోజు (శనివారం) హెచ్ఎండీఏ లే అవుట్‌లో మల్లారెడ్డి వేసిన రోడ్డును అధికారులు తొలగించేశారు.

## హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్‌ల పరిధిలో భారీగా సీఐలకు స్థానచలనం

హైదరాబాద్ మార్చ్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);హైదరాబాద్, సైబరాబాద్ కమిషనరేట్‌ల పరిధిలో భారీగా సీఐలకు స్థానచలనం జరిగింది. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో 63 మంది సీఐ మంది సీఐలు బదిలీ అయ్యారు. ఈ మేరకు సీపీ శ్రీనివాస్‌రెడ్డి సీఐలను బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో 41 మంది సీఐలను అవినాశ్ మహంతి బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇదిలా ఉండగా.. ఇటీవల నగర పరిధిలో పోలీసులు ప్రభుత్వం బదిలీలు చేస్తున్న విషయం తెలిసిందే. రెండు రోజుల కింద రాచకొండ పోలీస్ కమిషనరేట్ పరిధిలో 17 మంది ఇన్స్‌పెక్టర్‌లను బదిలీ చేస్తూ సీపీ తరుణ్ జోషి బదిలీ చేశారు.

## లీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో టిబి అవగాహనా కార్యక్రమం..ర్యాలీ




సికింద్రాబాద్ మార్చ్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);లీడ్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో సికింద్రాబాద్ లోని వాల్మీకి నగర్ ప్రైమరీ స్కూల్ లో హ్యూమన పీపుల్ టు పీపుల్ ఇండియా వారు టీబీ అవేర్ నెస్ కార్యక్రమం తో పాటు విద్యార్థులతో ర్యాలీని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సంస్థ సిపీఎల్ .మిథ్లేష్‌కుమార్ శర్మనల్ల మంజులత తో పాటు సతీష్, శ్యామల, శారద,సంధ్య, నవీన, పరశురాం,దినకర్, అమృత స్తానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మిథ్లేష్‌కుమార్ శర్మ మాట్లాడుతూ రెండు వారాలపాటు వరుసగా జ్వరం రావడం, దగ్గు, బరువు తగ్గడం వంటివి ఉంటే అవి టిబి లక్షణాలుగా భావించవలసి వస్తుందని అన్నారు. వెంటనే సమీపంలోని ఆసుపత్రికి వెళ్లి టీబి పరీక్షలు చేయించుకోవాలని ఆయన సూచించారు. నిర్ధారణ అయితే ఆరు నెలల పాటు వరుసగా మందులు వాడవల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వం అందజేసే పథకాలలో భాగంగా టీవీ వచ్చిన వారికి మందులతో పాటు పౌష్టికారం,నెలకు 500 రూపాయలు ఇవ్వడం జరుగుతుందని ఆయన తెలిపారు. హైదరాబాదులోని స్లమ్ ప్రాంతాల్లో లీడ్స్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. టీబీ వచ్చి వచ్చిన వారిని రూల్ మాడల్ గా తీసుకొని వివరించడం జరుగుతుంది అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో నల్ల మంజులత వాల్మీకి నగర్ ప్రైమరీ స్కూల్ హెడ్ మాస్టర్ సుజాత మరియు ఉపాధ్యాయురాలు జ్యోతి తదితరులు పాల్గొన్నారు

### నేటి కందం– నేటికి అందం

**అన్యమ్మును మది దలచక**
**ధన్యమ్మొనరించుకొనగ తమతమ బ్రతుకుల్**
**పుణ్యాత్ములు రావలయును**
**వన్యప్రాణుల దినోత్సవమ్మును జరుపన్**



( మార్చి 3 ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవం)

-రాధశ్రీ
సెల్:9494481210

# వన్యప్రాణుల పరిరక్షణలో డిజిటల్ ఆవిష్కరణలు

మనిషికి ఊపిరితిత్తులు ఎంత ముఖ్యమో భూగోళ పర్యావరణానికి అటవీ సంపద అంతే ప్రధానం. అటవీ సంపదలో దట్టమైన హరిత వనాలు, అందులో అంతర్భాగమైన జీవజాతులు లేదా వన్యప్రాణులు వస్తాయి. అడవుల్లో ఉండే జంతు, వృక్షజాలం మానవాళికి వెలకట్టలేని మేలును చేస్తున్నది. మానవ ప్రమేయం లేకుండా స్వతంత్రంగా అడవులలో జీవించే వృక్ష, జంతుజాలాన్ని వన్యప్రాణులుగా పిలుస్తారు. వన్యప్రాణుల్లో భారీ ఏనుగులు, జిరాఫీలు, రైనోలతో మె?దలు పక్షులు, క్రిమికీటకాలు, సూక్ష్మజీవులు వస్తాయి. దేశవ్యాప్తంగా వన్యప్రాణులను అటవీ సంపదగా కాపాడుకుంటూ, జీవ వైవిధ్యాన్ని పదిలపరుచుకోవాలనే అవగాహన సమాజంలో కల్పించడానికి ప్రభుత్వాలు, పభుత్వేతర సంస్థలు, స్వచ్ఛంధ కార్యకర్తలు కృషి చేయాల్సిన సమయం ఆసన్నమైంది. వన్యప్రాణులను ఆహారంగానే కాకుండా జంతు అవయవాలు, కలప అక్రమ వ్యాపారం కోసం చట్టాలను ఉల్లంఘించి వేటాడడం/నరకడం జరుగుతోందనేది కఠిన వాస్తవం.

ప్రపంచ వన్యప్రాణుల దినం–2024 నినాదం:

వన్యప్రాణి ప్రాముఖ్యతను గుర్తించిన ఐరాస తన సుస్థిరాభివృద్ధి లక్ష్యాల్లో 15వ అంశంగా జీవవైవిధ్య పరిరక్షణను తీసుకొని వన్యప్రాణుల మనుగడ ప్రాధాన్యాన్ని ప్రచారం చేస్తూ, సభ్యదేశాలకు దిశ నిర్దేశనం చేస్తున్నది. ఇదే క్రమంలో వన్యప్రాణుల ప్రాముఖ్యతను ప్రజలకు వివరించే సదుద్దేశంతో 1973లో "సిఐటిఈయస్ (కన్వెన్షన్ ఆన్ ఇంటర్నేషనల్ ట్రేడ్ ఇన్ ఎండేంజర్డ్ స్పీసీస్ ఆఫ్ వైల్డ్ ఫానా అండ్ ఫ్లోరా)" వ్యవస్థాపన దినం గుర్తుగా తీసుకున్న తీర్మానం ప్రకారం ప్రతి ఏటా ఐక్యరాజ్యసమితి మార్చి 03న "ప్రపంచ వన్యప్రాణి దినోత్సవాల"ను ప్రతిష్టాత్మకంగా చేబడుతున్నది. ఈ ఏడాది వన్యప్రాణి పరిరక్షణ సంస్థ "సిఐటిఈయస్" 50వ పుట్టిన రోజును (స్వర్ణోత్సవాలు) కూడా జరుపుకోవడం విశేషం. అడవుల నరికివేతను కట్టడి చేస్తూ, జాతీయ ఉద్యానవనాలు, జీవావరణ నిల్వలు, వన్యప్రాణి అభయారణ్యాలు ఏర్పాటు చేయడం ద్వారా జీవ వైవిధ్యం కాపాడబడి, పర్యావరణ పరిరక్షణకు ఊతం ఇస్తుందన్న అవగాహన కలిగి ఉండాలి. ప్రపంచ వన్యప్రాణి దినం–2024 నినాదంగా "వన్యప్రాణుల సంరక్షణలో డిజిటల్ ఆవిష్కరణ ప్రమేయం : ప్రజలను భూగోళంతో కలపడం (కనెక్టింగ్ పీపుల్ అండ్ ప్లానెట్ : ఎక్స్‌ప్లోరింగ్ డిజిటల్ ఇన్నొవేషన్ ఇన్ వైల్డ్‌లైఫ్ కన్జర్వేషన్)" అనబడే అంశం తీసుకోబడింది.

ప్రపంచ వన్యప్రాణ సంపద:

ప్రపంచవ్యాప్తంగా ప్రతియేటా 5,500 రకాలైన జీవజాతులను

**(03 మార్చి 'ప్రపంచ వణ్యప్రాణి దినం' సందర్భంగా)**

పలు స్వార్థ ప్రయోజనాల కోసం అక్రమంగా విక్రయిస్తున్నారని తేలింది. వన్యప్రాణుల పరిరక్షణతోనే జీవ వైవిధ్యం నెలకొంటూ, కాలుష్యం తగ్గించబడి, పర్యావరణ సమతుల్యత సాధ్యపడుతుంది. వన్యప్రాణి దినోత్సవాల్లో భాగంగా అటవీ శాఖ నేతృత్వంలో సదస్సులు, సమావేశాలు, కార్యశాలలు, పలు రకాలైన పోటీలు, గోడ పత్రికల విడుదల, వీధి నాటికలు, జంతు మరియు పక్షుల ప్రదర్శనశాల (జూలు) సందర్శనలు, వన సందర్శనలు, వనమహోత్సవాలు, వన్యప్రాణి పుస్తక పఠనం, వన్యప్రాణుల వీడియోలు చూపించడం, స్వచ్ఛ ప్రపంచం, పర్యవరణ వేత్తలతో ముఖాముఖి లాంటి వేదికల ద్వారా ప్రజలకు మరియు విద్యార్థి లోకానికి వన్యప్రాణుల పరిరక్షణ అవసరాన్ని వివరిస్తారు. ఈ దినోత్సవాలలో వన్యప్రాణి పరిరక్షణకు తీసుకోవలసిన చర్యలు, చట్టాల అమలులో పటిష్టత, అవసరమైన నూతన చట్టాల రూపకల్పన, జీవ సంరక్షణ అవసరం, అభాయారణ్యాల ఏర్పాటు, జాతీయ ఉద్యానవనాల స్థాపన, అడవుల నరివేతను వ్యతిరేకించడం వంటి అంశాలలో లోతైన చర్చలు జరపాలి.

భారత వన్యప్రాణుల సంపద:

1952లో ఏర్పాటు చేసిన భారత "జాతీయ వన్యప్రాణుల మండలి" చొరవతో వన్యప్రాణి సంరక్షణ చట్టం–1972 తీసుకువచ్చి దేశవ్యాప్తంగా వన్యప్రాణి సంరక్షణ కార్యక్రమాలు ఉద్యమంలా సాగుతున్నాయి. ఇండియాలోని అడవుల్లో 91,797 రకాలైన జంతుజాతులు మరియు 46,340 రకాల వృక్షజాతులు ఉన్నది. వీటికి తోడుగా 2,634 రకాల చేపల జలజాతుల సంపద మన దేశంలో ఉన్నది. ప్రపంచంలోని జీవజాతుల్లో 80 శాతం వరకు జీవవైవిధ్యం కలిగిన జంతు సంపద మన దేశంలోనే ఉంది. వీటిలో క్షీరదాలు, పక్షులు, సరిసృపాలు, ఉభయచరాలు లాంటి జీవుల అపారసంపద మన అడవులకు, మానవాళికి ఎనలేని సేవలందిస్తున్నాయి. ఉత్తరాన హిమాలయాల నుండి దక్షిణాన కేరళ అడవుల వరకు అపార జీవ వైవిధ్యంతో అటవీ గొర్రెలు, మేకలు, పులులు, చిరుతలు, అడవి దున్నలు, గేదెలు, అటవీ పిల్లులు, జింకలు, లంగూర్స్, కోతులు, గాడిదలు, ముళ్ళ పందులు, దుప్పులు, కుందేళ్లు, నక్కలు, ముంగీసలు, హైనాలు, గబ్బిలాలు, కుక్కలు, పలు రకాల పాములు, మె?సళ్లు, ఒంటెలు, ఏనుగులు, సింహాలు, తాబేళ్లు, బల్లులు, వైవిధ్యభరిత 2000 రకాల పక్షులు, ఖడ్గమృగాలు, అపార క్రిమికీటకాలు లాంటి అనంఖ్యాక జంతుజాలం మన అడవుల సౌందర్యాన్ని ఇనుమడింపజేస్తున్నాయి. మన జాతీయ జంతువుగా టైగర్, జాతీయ పక్షిగా నెమలి గుర్తించబడినవి. మన దేశంలో అనేక అభయారణ్యాలు, జాతీయ ఉద్యానవనాలు, జంతు నిల్వల అడవులు ఉన్నాయి. టైగర్ ప్రాజెక్ట్ పథకంలో భాగంగా 21 టైగర్ రిజర్వులు నిర్వహించబడుతున్నాయి. అతి పెద్ద జీవ వైవిధ్యం కలిగిన 12 దేశాలలో భారత్ ఒకటిగా పేరు తెచ్చుకుంది. మన దేశంలోని ఈస్టర్న్ హిమాలయాలు మరియు వెస్టర్న్ ఘాట్స్ అంతర్భాగంలో ప్రపంచపు 20 శాతం జంతుజాలం ఉంది. ఇండియాలో 3.64 శాతం భారత భూభాగంలో 1.2 లక్షల చదరపు కిలోమీటర్ల పరిధిలో 553 అభయారణ్యాలు ఉన్నాయి.

వన్యప్రాణి పరిరక్షణ చర్యలు:

స్వార్థపూరిత మానవుడు వన్యప్రాణుల అక్రమ వ్యాపారం పేరుతో పలు రకాలైన క్షీరదాలు, సరీసృపాలు, పక్షులు, చేపలను వేటాడుతూ, జీవ వైవిధ్యానికి ఎనలేని నష్టాన్ని కలిగిస్తున్నాడు. జీవ సమతుల్యతకు, పర్యావరణ పరిరక్షణకు, ఆహార చక్ర గమనానికి, జీవ వైవిధ్య పరిపుష్టికి, వృక్షరాజ్య విస్తరణకు, పర్యావరణ శుద్ధికి, వన్య జంతువు సంతాన స్థిరాభివృద్ధికి, పలు రకాలైన కాలుష్యాల కట్టడికి, వృక్షజంతుజాలల వైవిధ్యానికి కాపాడటానికి, పర్యాటకరంగ అభివృద్ధికి, క్రీడలు(ఫిషింగ్, వేట) పరిశోధనలు మె?దలగు అంశాలకు వన్యప్రాణుల సంరక్షణ అత్యంత అవసరమని గమనించాలి. వన్యప్రాణుల పరిరక్షణతో పలు అటవీ ఉత్పత్తులైన ఔషధాలు, తేనె, పట్టు, వెంట్రుకలు, ఈకలు, తోలు, చర్మాలు, దంతాలు (చనిపోయిన తరువాత) వంటివి లభిస్తాయి. వన్యప్రాణుల నుండి వంట చెరుకు, కలప, పండ్లు, కాయలు, పువ్వులు, జిగురు లాంటి ఉత్పత్తులు కూడా ప్రత్యేక్షంగా లభిస్తాయి. మన సంస్కృతితో భాగంగా ఏనుగు శిక్ష రస్సుగల గణపతి వెంట ఎలుక, దుర్గమాత వెంట పులి, సరస్వతి వెంట నెమలి, శ్రీరాముని వెంట వానరులు మరియు ధైర్యసాహసాలకు ప్రతీకగా సింహం, శివుని మె?డలో నాగుపాము వంటి జంతువుల సాహచర్యంతో వన్యప్రాణి ప్రాముఖ్యతలను ఆధ్యాత్మిక పాఠంగా బోధిస్తున్నాయి.

ప్రమాదంలో వన్యప్రాణుల మనుగడ:

వన్యప్రాణులతో మానవాళికి ప్రాణభయం, వాహనాల ధ్వంసం, సాధుజంతులపై దాడి, పంటచేను విధ్వంసం, క్రిమికీటకాలతో పంట తెగుళ్ళు వంటి నష్టాలు కూడా ఉన్నాయి. అడవుల నరికివేత, పోడు వ్యవసాయం, ప్రకృతి వైపరీత్యాలు (అడవులు కాలిపోవడం, భూకంపాలు, వరదలు, తీవ్ర కరువు లాంటి), పారిశ్రామికీకరణ, డ్యాముల నిర్మాణం, రోడ్లు వేయడం, రైలు మార్గాలు, జలాశయాల రూపకల్పన, అక్రమ సంపాదనకు జంతు వేట, అటవీ సంపద దుర్వినియోగం, పర్యావరణ కాలుష్యం, భూతాపం, ఓజోన్ పొర పలుచబడడం లాంటి కారణాలతో అటవీ జంతుజాలానికి ప్రమాదం పొంచి ఉన్నది. సాధారణ జాతులు, విపత్తులో ఉన్న జాతులు, హానికర స్థితిలో ఉన్న జాతులు, అరుదైన జాతులు, అంతరించి పోయిన జాతులు వంటి పలు రకాలైన వన్యప్రాణులు ప్రమాద హెచ్చరికలు చేస్తున్నాయి. అంతరించి పోయిన వర్గంలో తెలుపు హెరోన్, స్యాండ్‌పైపర్, సైబేరియన్ క్రేన్, తెలుపు వల్చర్, సాఫిష్, రెడ్ టర్టిల్, రాక్ ర్యాట్, పాండిచ్చెరి షార్క్, రీనోసీరోస్, చేపలు తినే మె?సళ్ళు మె?దలగు పలు జీవజాతులు ఉన్నాయి.

భారత్‌లో అభయారణ్యాలు/ఉద్యానవనాలు:

వన్యప్రాణి సంరక్షణలో భాగంగా ఏర్పాటు చేసిన జాతీయ ఉద్యానవనాలలో ఉత్తరాఖండ్‌లోని జిమ్ కార్బెట్ నేషనల్ పులుల రక్షణ పార్క్, యూపీలోని దుద్వా కోతుల పార్క్, గుజరాత్‌లోని సింహాల ఘిర్ పార్క్, యంపీలోని కన్హా జింకల పార్కులు, శివపురి వోల్ఫ్ పార్కులు, ఒడిసాలోని సిమిలిపాల్ పులుల పార్క్, సుందర్‌భన్, మానస్ లాంటి అనేక జాతీయ ఉద్యానవనాలు జీవ వైవిధ్యాన్ని కాపాడుతున్నాయి. వీటితో పాటు మన దేశంలో వన్యప్రాణి అభయారణ్యాలుగా దచిగమ్(జమ్ము–కాశ్మీర్), రాజాజీ (ఉత్తరాఖండ్),బన్‌బాస (అస్సాం), రాథంబోర్ మరియు సరిస్కా(రాజస్థాన్), కవల్(మహారాష్ట్ర), చండకా(ఒడిసా), పోచారం–ఏటూర్‌నాగారం(తెలంగాణ), బందీపూర్( కర్నాటక), గిండీ మరియు మధుమలై(తమిళనాడు), పెరియార్ (కేరళ) వంటివి పేరొందినవి. భారత్‌లో పులులు, ఏనుగులు, తాబేళ్ళు మరియు మె?సళ్ళను కాపాడేందుకు అటవీ ప్రాజెక్టులు ఉన్నాయి.

అంతరించే జంతుజాతులను రక్షించలేమా..!

అంతరించే ప్రమాదంలో ఉన్న జంతువుల ఆవాసాలను కాపాడడం, అక్రమ వేటను అరికట్టడం, పోడు వ్యవసాయానికి ప్రత్యామ్నాయాలు వెదకడం, జాతీయ ఉద్యానవనాల ఏర్పాటు, అభయారణ్యాల నిర్వహణ, ఫారెస్ట్ రిజర్వుల అజామాయిషీ, అటవీ చట్టాలను కఠినంగా అమలు చేయడం, అక్రమ అడవుల నరికివేతను అడ్డుకోవడం, అడవుల్లో మానవ రవాణ వ్యవస్థలను చేపట్టకపోవడం, విపత్తులో ఉన్న జీవ జాతుల పునరుత్పత్తికి చర్యలు తీసుకోవడం, అడవుల్లో పెద్ద ఎత్తున మె?క్కలు నాటడం లాంటి చర్యలు చేపట్టడం ద్వారా వన్యప్రాణుల సంరక్షణకు బీజాలు పడతాయి. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా 37,000 జంతు వృక్ష జాతులను రక్షించే పటిష్ట చర్యలు తీసుకోవడం ముదావహం.

వనానికి అందాన్నిచ్చే దట్టమైన వృక్షాలు, అనేక రకాల జంతు జాతులు సకల మానవాళికి జీవవైవిధ్యం కల్పిస్తూ అపూర్వ సేవలు అందిస్తున్నాయి. జీవవైవిధ్యానికి విఘాతం కలిగితే కరోనా లాంటి విశ్వ మహమ్మారులు విజృంభిస్తాయని మన ఎదుర్కొంటున్న చేదు అనుభవాలు తెలుపుతున్నాయి. భూమిని నివాసయోగ్యం గ్రహంగా కాపాడుకున్నపుడే భవిష్యత్ తరాలు పర్యావరణ పరిరక్షణతో ఆరోగ్యకర వాతావరణంలో నివసించగలుగుతారు. జీవకోటి సమతుల్యత కోసం వన్యప్రాణులను కాపాడుకోవడం మనందరి బాధ్యత అని గుర్తించాలి.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

## దేశం ఎపిక్ మూడ్‌లో ఉంది & మేము ప్రతి విషయంలోనూ పురోగమిస్తున్నాము -ఉప రాష్ట్రపతి

న్యూఢిల్లీ, మార్చి 2:దేశం ఎపిక్ మూడ్‌లో ఉందని, మనం ప్రతి విషయంలోనూ పురోగమిస్తున్నామని ఉపరాష్ట్రపతి శ్రీ జగదీప్ ధంఖర్ ఈరోజు నొక్కి చెప్పారు. "భారతదేశం యొక్క ఎదుగుదల ఆపలేనిది" అని నొక్కిచెప్పిన ఆయన, దేశం యొక్క అద్భుతమైన ఎదుగుదల పట్ల యువత గర్వపడాలని కోరారు.

ఈ రోజు ధార్వాడ్ ఎ.ఎం విద్యార్థులు మరియు అధ్యాపకులను ఉద్దేశించి ఎఖ ప్రపంచ బ్యాంక్ మరియు ఎ.ఓ.ఈ వంటి ప్రపంచ సంస్థల ఇటీవలి ప్రకటనలను ప్రస్తావించారు మరియు భారత దేశాన్ని పెట్టుబడి మరియు అవకాశాలకు ఇష్టమైన గమ్యస్థానంగా అభివర్ణించారు. శతాబ్దాల క్రితమే మనం ప్రపంచంలోనే నంబర్ వన్ దేశంగా ఉన్నామని ఉద్ఘాటించిన ఆయన 2047లో మనమే నంబర్ వన్ అవుతామని, అందుకు యువత సన్నద్ధం కావాలని కోరారు.

ఈరోజు హుబ్బలి–ధార్వాడ్‌కు తన రోజంతా పర్యటన సందర్భంగా, ఉపరాష్ట్రపతి ఐఐటి ధార్వాడ్‌లో ప్రధాన గేట్ కాంప్లెక్స్, నాలెడ్జ్ రిసోర్స్ మరియు డేటా సెంటర్ మరియు సెంట్రల్ లెర్నింగ్ థియేటర్‌ను ప్రారంభించారు. గ్రీన్ ఎనర్జీ పర్యావరణ వ్యవస్థను మరింతగా పెంచే రూఫ్ టాప్ సోలార్ ప్యానెల్ సదుపాయానికి ఆయన పునాది రాయి వేశారు.

పరిపాలన మరియు ప్రజాస్వామ్యంలో యువత అత్యంత కీలకమైన వాటాదారులని అభివర్ణించిన ఆయన, వారు దేశానికి అవసరమైన మార్పును తీసుకువస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. రాబోయే కాలంలో ఐఐటీ ధార్వాడ్ ఉన్నత స్థాయికి చేరుకుంటుందన్న విశ్వాసాన్ని వ్యక్తం చేస్తూ, పూర్వ విద్యార్థులు ఒక సంఘాన్ని ఏర్పాటు చేసి, ప్రతి రూపంలో తమ విద్యాసంస్థలకు తిరిగి ఇవ్వాలని విపి విజ్ఞప్తి చేశారు.

చట్టం ముందు సమానత్వం ఉంటే తప్ప ప్రజాస్వామ్యం సంపూర్ణం కాదని నొక్కిచెప్పిన విపి, నేటి యువత కోరుకునే మొదటి విషయం – చట్టం ముందు సమానత్వం అని అన్నారు. "చట్టం ముందు సమానత్వం లేకపోతే, మీ గౌరవం రాజీపడుతుంది. తమను తాము చట్టానికి అతీతంగా భావించే వారు జవాబుదారీగా ఉన్నారు మరియు చట్టం ముందు సమానత్వమే నేడు గ్రౌండ్ రియాలిటీ అని కఠినమైన మార్గాన్ని నేర్చుకుంటున్నారు, "అన్నారాయన.

అవినీతి అనేది "చాలా కాలంగా నిషేధం" అని పేర్కొన్న శ్రీ ధంఖర్ కొన్ని సంవత్సరాల క్రితం అవినీతి లేకుండా ఏదీ సాధ్యం కాదని హైలైట్ చేశారు. వ్యవస్థలో పారదర్శకతను తీసుకురావడానికి ఇటీవలి సంస్కరణలపై దృష్టి సారిస్తూ, "ప్రభుత్వ కాంట్రాక్ట్, ప్రభుత్వ ఉద్యోగం లేదా అవకాశాన్ని పొందేందుకు అవినీతి మాత్రమే మార్గం ఉ అనుసంధాన ఏజెంట్లు సోకిన పవర్ కారిడార్‌లు" అని ఆయన పేర్కొన్నారు. పవర్ కారిడార్‌లు అవినీతి మూలకాలను నిర్వీర్యం చేసినందున ఇప్పుడు పెద్ద మార్పు వచ్చిందని ఎఖ నొక్కిచెప్పారు మరియు "అభిమానం కాదు, దేశభక్తి మరియు బంధుప్రీతి కాదు, కానీ మెరిట్ మరియు మెరిట్ మాత్రమే యువ మనస్సు యొక్క ప్రయత్నాల ఫలితాన్ని నిర్దేశిస్తాయి'' అని నొక్కిచెప్పారు.మన ఘాతాంక మరియు అసాధారణమైన వృద్ధికి మనం గర్వపడాలని నొక్కిచెప్పిన ఎఖ, భారతదేశ పురోగతిని కొన్ని అంశాలు జీర్ణించుకోలేకపోతున్నాయని అన్నారు. చిల్లర రాజకీయ ప్రయోజనాల కోసం కొన్ని శక్తులు సాగిస్తున్న దేశ వ్యతిరేక కథనాలపై బాధను వ్యక్తం చేస్తూ, ఇలాంటి దుష్ట ప్రయత్నాలను తటస్థం చేయాలని యువతకు పిలుపునిచ్చారు.

## 2024 సార్వత్రిక ఎన్నికలకు ముందు, రాజకీయ పార్టీలు బహిరంగ ప్రచారంలో మర్యాదను కొనసాగించాలి

న్యూఢిల్లీ, మార్చి 2:ఇటీవలి ఎన్నికలలో రాజకీయ ప్రచార ప్రసంగం యొక్క వివిధ పోకడలు మరియు క్షీణత స్థాయిలను పరిగణనలోకి తీసుకుంటూ, భారత ఎన్నికల సంఘం అన్ని రాజకీయ పార్టీలకు బహిరంగ ప్రచారంలో అత్యంత సంయమనం పాటించాలని మరియు ఎన్నికల ప్రచార స్థాయిని పెంచాలని మరింత సలహాను జారీ చేసింది. "సమస్య" ఆధారిత చర్చ.

ఎంసిసిని నివారించడానికి ఎన్నికల సమయంలో గతంలో తెలిసిన పద్ధతులను అనుసరించి ఉల్లంఘనల విషయంలో స్టార్ క్యాంపెయినర్లు మరియు అభ్యర్థులను కమిషన్ 'నోటీస్'లో ఉంచింది. రాబోయే ఎన్నికలలో సమస్యలో సమయం మరియు కంటెంట్ పరంగా ఇవ్వాల్సిన నోటీసులను తిరిగి పని చేయడానికి న్యాయమైన ప్రాతిపదికగా ఎన్నికల సంఘం సలహా ప్రకారం ఏవైనా పరోక్ష ఎంసిసి ఉల్లంఘనలను అంచనా వేస్తుంది. లోక్‌సభకు జరిగే సాధారణ ఎన్నికలకు మరియు నాలుగు రాష్ట్రాల శాసనసభలకు సాధారణ ఎన్నికలకు, అన్ని దశలు మరియు ఎన్నికల భౌగోళిక ప్రాంతం "పునరా వృతం" నేరాలను గుర్తించడానికి ఆధారం.

భావప్రకటనా స్వేచ్ఛ మరియు లెవెల్ ప్లేయింగ్ ఫీల్డ్ మధ్య సమతుల్యతను కొనసాగించాల్సిన అవసరాన్ని అంగీకరిస్తూనే, కమిషన్ గత కొన్ని రౌండ్ల ఎన్నికల నుండి స్వీయ–నియంత్రణ విధానాన్ని అనుసరిస్తోందని, దాని నోటీసు నైతిక నిందారోపణగా ఉపయోగపడుతుందని సూచించింది. అభ్యర్థి లేదా స్టార్ క్యాంపెయినర్‌కు. కమిషన్ జారీ చేసిన ఆదేశాలు పూర్తిగా నిషేధాల కంటే ప్రచార కార్యకలాపాలకు కనీస అంతరాయం కలగకుండా జాగ్రత్తగా రూపొందించబడ్డాయి. ఏది ఏమైనప్పటికీ, ఎంసిసి నోటీసులను న్యాయబద్ధంగా ఉపయోగించి, నైతిక నిందారోపణతో సమానమైన ఉపన్యాసం స్థాయిని తనిఖీ చేయడం, తప్పుగా అర్థం చేసుకోబడదు మరియు తదుపరి ఎన్నికల చక్రంలో పునరావృతం కాకపోవచ్చు. అదనంగా, అడ్వైజరీ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మరియు సోషల్ మీడియా ప్లాట్‌ఫారమ్‌ల యొక్క అభివృద్ధి చెందుతున్న ప్రకృతి దృశ్యాన్ని అంగీకరించింది మరియు సోషల్ మీడియా ప్లాట్‌ఫాంమ్‌లు ఓఅఆకి ముందు మరియు 48 గంటల నిశ్శబ్ద కాలం మధ్య లైన్లను అస్పష్టం చేశాయి, ఇది ప్రచారం యొక్క బహుళ దశలలో మరియు సంబంధం లేని ఎన్నికలలో కంటెంట్ యొక్క నిరంతర ప్రసరణకు దారితీసింది.అన్ని రాజకీయ పార్టీలు, వాటి నాయకులు మరియు పోటీ చేసే అభ్యర్థులు మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ మరియు చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్ పరిమితుల్లో ఉండాలని కమిషన్ కోరింది. ఎన్నికల ప్రచార స్థాయిని పెంచడానికి ఎంసిసి మరియు సర్రోగేట్ మార్గాలను సరోగేట్ లేదా పరోక్షంగా ఉల్లంఘించే ఏవైనా రకాలు కమిషన్ ద్వారా కఠిన చర్యలు తీసుకుంటాయని నొక్కి చెప్పబడింది.

ప్రజాప్రాతినిధ్య చట్టం, 1951 లోని సెక్షన్ 77 ప్రకారం "స్టార్ క్యాంపెయినర్లు"గా నియమించబడిన రాజకీయ పార్టీ నాయకులు ముఖ్యమైన రాజకీయ ర్యాలీలలో ప్రసంగాలు చేస్తారు. మోడల్ ప్రవర్తనా నియమావళి మరియు చట్టం యొక్క చట్టబద్ధమైన నిబంధనలు ఒకదానికొకటి పూరకంగా ఉన్నందున, సామరస్యపూర్వకమైన మరియు ఉద్దేశపూర్వక నిర్మాణం యొక్క చట్రంలో దీనిని అర్థం చేసుకోవడం చాలా అవసరం. కాబట్టి, సెక్షన్ 77 ద్వారా మంజూరు చేయబడిన అధికారాలను అనుభవిస్తూనే, ఎన్నికల ప్రచార సమయంలో అత్యున్నత నైతిక ప్రమాణాలను పాటించే బాధ్యతను స్టార్ క్యాంపెయినర్లు కూడా కలిగి ఉంటారు.

'భాషావిభూషణ' డాక్టర్ నాగభైరవ ఆదినారాయణ
'మట్టిబండి' తృతీయ ముద్రణ
ఆహ్వానము
ఆవిష్కరణోత్సవం



| | | |
|---|---|---|
| వేదిక | : | పద్మావతి కళావేదిక, శ్రీవేంకటేశ్వరస్వామి దేవాలయం బృందావన్ గార్డెన్స్, గుంటూరు |
| సమయం | : | ది.10-03-2024, ఆదివారం ఉదయం 10 గం.లకు |
| సభాధ్యక్షులు | : | డాక్టర్ కందిమళ్ళ సాంబశివరావు ప్రముఖ నాటక రచయిత, దర్శకుడు, విమర్శకుడు |
| జ్యోతి ప్రజ్వలన | : | శ్రీ చిటిపోతు మస్తానయ్య ఆలయ కమిటి అధ్యక్షులు |
| గ్రంథావిష్కరణ | : | శ్రీ గుళ్ళపల్లి సుబ్బారావు |
| ముఖ్య అతిథి | : | డాక్టర్ నాళేశ్వరం శంకరం కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యులు |
| ఆత్మీయ అతిథి | : | శ్రీ వల్లూరి శివప్రసాద్ కేంద్ర సాహిత్య అకాడమీ సలహా సంఘ సభ్యులు |
| పుస్తక సమీక్ష | : | శ్రీమతి పింగళి భాగ్యలక్ష్మి |
| సభా నిర్వహణ | : | డాక్టర్ వెన్నిసెట్టి సింగారావు |

అందరూ ఆహ్వానితులే

ఆహ్వానించువారు
డాక్టర్ జెక్కంపూడి సీతారామారావు
అధ్యక్షులు, ఎన్.జి. రంగ ఫౌండేషన్ - గుంటూరు

## ఇంటర్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన జిల్లా కలెక్టర్



మహబూబ్‌నగర్, మార్చి 2 :ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల సందర్భంగా ఇవాళ మక్తల్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల పరీక్షా కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. పరీక్షా కేంద్రంలో ఇంటర్ ఫస్టియర్ సెకండ్ లాంగ్వేజ్ పరీక్ష కొనసాగుతోంది.

పరీక్షా కేంద్రంలో ఆయన పరీక్షలు కొనసాగుతున్న విధానాన్ని పరిశీలించారు .ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ తో మాట్లాడారు. ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష కోరారు. కలెక్టర్ వెంబడి స్థానిక తహశీల్దార్ సువర్ణ రాజ్ ఉన్నారు.

## సొంత గూటికి వసంత - మైలవరం ఎమ్మెల్యే టీడీపీలో చేరిక

అమరావతి, మార్చి 2: మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తెలుగుదేశం పార్టీలో చేరారు. హైదరాబాద్ వేదికగా టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు సమక్షంలో, ఆయన నివాసంలో శనివారం ఉదయం పసుపు కండువా కప్పుకొని టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా వసంత కృష్ణప్రసాదు వెంట ఆయన అభిమానులు మైలవరం నియోజకవర్గంలోని అన్ని మండలాల నుంచి హైదరాబాదుకు తరలివచ్చారు. ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్తో పాటు ఎన్టీఆర్ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నెట్టెం రఘురాం, విజయవాడ పార్లమెంట్ నియోజకవర్గ టీడీపీ నాయకులు కేశినేని శివనాథ్ (చిన్ని) భారీ సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.

వైసీపీ ఎమ్మెల్యే వసంత కృష్ణ ప్రసాద్ తో పాటు మైలవరానికి చెందిన ఎంపీపీ, ఇద్దరు వైస్ ఎంపీపీలు, ఆరుగురు ఎంపీటీసీలు, పన్నెండు మంది సర్పంచ్‌లు, ఏడుగురు సొసైటీ ప్రెసిడెంట్లు, నలుగురు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. టీడీపీలో చేరిన తర్వాత వసంత కృష్ణప్రసాద్ ఏపీ సీఎం జగన్‌పై తీవ్ర స్థాయిలో విమర్శలు చేశారు. వ్యక్తిగత దూషణలు చేస్తేనే ఆ పార్టీలో టికెట్ ఇస్తారని లేదంటే టికెట్ రాదని మండిపడ్డారు. ప్రతిపక్షాలను తిడితే మంత్రి పదవులు ఇస్తారని లేదంటే పట్టించుకోరని అసహనం వ్యక్తం చేశారు. ఈ కారణాల వల్లే వైసీపీని వీడాల్సి వచ్చిందని వసంత కృష్ణప్రసాద్ స్పష్టం చేశారు. వైసీపీలో తనకు ఎలాంటి గౌరవం దక్కలేదన్నారు. చంద్రబాబు మళ్లీ సీఎం కావాలన్నదే తన కోరికన్నారు.కాగా.. మైలవరం టీడీపీ టికెట్‌పై వసంత కృష్ణ ప్రసాద్ కీలక వ్యాఖ్యలు చేశారు. అన్ని సర్వేల్లోనూ మైలవరంలో తానే గెలుస్తానని తేలిందన్నారు. జగన్ పిలిచి టికెట్ నీకేనని చెప్పినా వద్దని వచ్చేసినట్లు తెలిపారు. చంద్రబాబు పోటీ చేయమంటే చేస్తానని లేకపోతే పార్టీ కోసం పనిచేస్తానని కృష్ణప్రసాద్ తేల్చిచెప్పారు.

## ICAR-IARIలో బాలికల హాస్టల్, బాయ్స్ హాస్టల్ మరియు స్టాఫ్ రెసిడెన్షియల్ కాలనీని ప్రారంభించిన కేంద్ర వ్యవసాయ మంత్రి




న్యూఢిల్లీ, మార్చి 2:కేంద్ర వ్యవసాయ ఉ రైతుల సంక్షేమం మరియు గిరిజన వ్యవహారాల మంత్రి శ్రీ అర్జున్ ముండా దాదాపు 22 కోట్లతో 156 గదులతో కూడిన గర్ల్స్ హాస్టల్ "మహువా", దాదాపు 24 కోట్లతో బాయ్స్ హాస్టల్ "కదం" 175 గదులు మరియు స్టాఫ్ రెసిడెన్షియల్ కాలనీని ప్రారంభించారు. ఈరోజు జార్ఖండ్‌లోని గౌరియా కర్మ, హజారీబాగ్‌లోని ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో దాదాపు 11.5 కోట్ల బడ్జెట్ వ్యయంతో వివిధ వర్గాల 25 క్వార్టర్లతో పలాష్ విహార్ కాలనీ". రాష్ట్ర విద్యాశాఖ మంత్రి శ్రీమతి. అన్నపూర్ణా దేవి; పార్లమెంటు సభ్యుడు, హజారీబాగ్, శ్రీ జయంత్ సిన్హా; సెక్రటరీ, డిపార్ట్‌మెంట్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఉ ఎడ్యుకేషన్ (అంఖీఇ) మరియు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్ (ICAR) డైరెక్టర్ జనరల్, డా. హిమాన్షు పాఠక్; డైరెక్టర్, ఇండియన్ అగ్రికల్చరల్ రీసెర్చ్ ఇన్స్టిట్యూట్, డా. అశోక్ కుమార్ సింగ్; ంఅఉ (సీడ్స్), ICAR, Dr D K యాదవ; ఈ కార్యక్రమంలో OSD, IARI జార్ఖండ్, డాక్టర్ విశాల్ నాథ్ మరియు ఇతర ప్రముఖులు కూడా పాల్గొన్నారు.

కేంద్ర వ్యవసాయం ఉ రైతుల సంక్షేమం మరియు గిరిజన వ్యవహారాల మంత్రి శ్రీ అర్జున్ ICAR-IARI జార్ఖండ్ వార్షిక నివేదిక 2023 అలాగే IARI బులెటిన్‌ను విడుదల చేశారు. కిసాన్ గోష్టి–కమ్–ఉద్ఘతాన్ సమరోహ్ సందర్భంగా ఆయన తన ప్రసంగంలో మాట్లాడుతూ జార్ఖండ్‌కు ఈ రోజు చాలా ముఖ్యమైన రోజు అని ప్రధాన మంత్రి రూ. రూ. 36000 కోట్లు బీహార్, జార్ఖండ్, పశ్చిమ బెంగాల్, ఒడిశా మొదలైన రాష్ట్రాలలో ఎరువుల డిమాండ్‌ను నెరవేర్చే ధన్‌బాద్‌లోని సింద్రీ ఎరువుల కర్మాగారంతో సహా జార్ఖండ్ భూమి నుండి. ఈ రోజు కూడా బాలికల ప్రారంభోత్సవంగా ICAR-IARI జార్ఖండ్‌కు చాలా శుభ సందర్భం ఉ ఈ ఇన్‌స్టిట్యూట్‌లో పనిచేస్తున్న ఉద్యోగుల కోసం బాయ్స్ హాస్టల్స్ అలాగే రెసిడెన్షియల్ స్టాఫ్ కాలనీ.

వ్యవసాయ రంగంలో పరిశోధన ఉ నైపుణ్యాభివృద్ధి కోసం 2015 జూన్ 28న హజారీబాగ్ జిల్లాలోని గౌరియా కర్మ గ్రామంలో 1000 ఎకరాల విస్తీర్ణంలో IARI జార్ఖండ్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారని hri అర్జున్ ముండా తెలిపారు. ఈ సంస్థ ఆహార ధాన్యాలు, నూనెగింజలు, పప్పుధాన్యాలు, హార్టికల్చర్, అటవీ, పాడిపరిశ్రమ, పశువుల పెంపకం, చేపల పెంపకం మొదలైన వాటిపై పరిశోధనలను కేంద్రీకరిస్తుంది మరియు ఈ రంగాలలో కూడా విద్యను అందజేస్తుంది, ప్రస్తుతం 110 మంది విద్యార్థులు వివిధ విభాగాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీని పొందారు మరియు ప్రస్తుతం 240 మంది విద్యార్థులు ః.ాఇ చదువుతున్నారు. (వ్యవసాయం) దేశంలోని వివిధ ప్రాంతాల నుండి.

1960వ దశకంలో ప్రారంభమైన హరిత విప్లవం దేశీయ ఆహారోత్పత్తిలో గొప్ప పురోగతిని సాధించేలా చేసిందని మరియు వ్యవసాయం మరియు అనుబంధ రంగాలలో పురోగతికి గణనీయంగా దోహదపడిందని శ్రీ ముండా ఉద్ఘాటించారు. ఇది భారతదేశాన్ని ఆహార లోటు దేశం నుండి ఆహార మిగులు దేశంగా మార్చింది. మన తూర్పు రాష్ట్రాలు హరిత విప్లవం యొక్క ఫలాలను పండించలేకపోయాయని మరియు దేశంలోని ఇతర ప్రాంతాలలో వలె వ్యవసాయం మరియు అనుబంధ రంగాలలో పురోగతి సాధించలేదని ఆయన నొక్కిచెప్పారు, అందువల్ల ఈ సంస్థ తూర్పు భాగస్వామ్య వ్యవసాయ అభివృద్ధికి కేంద్ర బిందువుగా మారడానికి అంకితం చేయబడింది. సేంద్రీయ మరియు సహజ వ్యవసాయ పద్ధతుల ఆధారంగా దేశంలో రెండవ హరిత విప్లవానికి రాష్ట్రాలు శ్రీకారం చుట్టాయి. ఈ సంస్థ సహకారంతో విత్తన గ్రామ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా దేశీయంగా అభివృద్ధి చేసిన నానో యూరియాను ఉపయోగించాలని మరియు నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేయాలని కేంద్ర మంత్రి రైతులను ప్రోత్సహించారు. వ్యవసాయం మరియు అనుబంధ రంగాలతో సహా ప్రతి రంగంలో ఆవిష్కరణలను అనుసరించాలనే ప్రధాన మంత్రి దృష్టిని ఆయన హైలైట్ చేశారు మరియు రైతులకు 23 కోట్ల సాయిల్ హెల్త్ కార్డులు అందించబడ్డాయి మరియు ప్రభుత్వం ప్రతి మూడు సంవత్సరాలకు పునరుద్ధరించబడుతుంది. ఇక్కడ పనిచేస్తున్న శాస్త్రవేత్త గ్లోబల్ వార్మింగ్, క్లైమేట్ ఛేంజ్ మొదలైన ప్రస్తుత సవాళ్లను తగ్గించడానికి పరిష్కారాన్ని కనుగొనడానికి ప్రయత్నిస్తారు మరియు దేశంలోని తూర్పు ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ప్రధానమంత్రి కలను కూడా నెరవేరుస్తారు. "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" కోసం మనం అందరం కలిసి పని చేద్దాం అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

## షార్ట్ సర్క్యూట్‌తో పేలిన సిలిండర్లు.. అగ్నికి ఆహుతైన పొగాకు

అమరావతి, మార్చి 2:స్థానిక మండలంలోని కట్టుబడిపాలెం గ్రామంలో అనుమోలు వెంకటేశ్వర్లు, అనుమోలు ఆదిలక్ష్మి అను రైతులకి చెందిన పొగాకు బ్యార్న్ దగ్గర పచ్చాకు కూలీలు ఏర్పాటు చేసుకున్న గుడిసెల్లో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. దీనికి కరెంట్ షార్ట్ సర్క్యూట్ కారణం అంటున్నారు గ్రామస్థులు. ఆ ప్రక్కనే ఉన్న గుడిసెలో ఉన్న గ్యాస్ సిలిండర్లు ఒకేసారి పేలడంతో చుట్టుపక్కల జనం ఏమి జరుగుతుందో అని భయంతో పరుగులు తీశారు.ఎటువంటి ప్రాణ నష్టం జరగకపోవడంతో కట్టుబడిపాలెం ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. రెండు పొగాకు బ్యార్నిలకు సంబంధించి అయిదు లక్షల రూపాయల విలువ చేసే పొగాకు అగ్నికి ఆహుతైందని బ్యార్ని యజమానులు వివరాలు అందించారు. కొండపి ఫైర్ సిబ్బందికి సమాచారం ఇస్తే అది తమ పరిధి కాదు అనడంతో దిక్కుతోచని స్థితిలో 100 కాల్ చేయడంతో టంగుటూరు నుండి ఫైర్ సిబ్బంది, ఇంజన్ వచ్చి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పిందని గ్రామస్థులు వాపోయారు.

# జగన్‌ని ఇంటికి పంపాల్సిందే ..నెల్లూరులో వైసీపీ ఖాళీ- చంద్రబాబు



అమరావతి, మార్చి 2: ఆంధ్రప్రదేశ్‌ను పూర్తిగా నాశనం చేసిన జగన్‌ను ఇంటికి సాగనంపాలని తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబు అన్నారు. ఆంధ్రప్రదేశ్?లో తెలుగు దేశం-జనసేన ప్రభుత్వం ఏర్పాటు కానుందని ధీమా వ్యక్తం చేశారు. నెల్లూరులో శనివారం జరిగిన కార్యక్రమంలో రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఆయన సతీమణి సహా తన అనుచరులతో కలిసి చంద్రబాబు సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు.

అనంతరం చంద్రబాబు మాట్లాడుతూ.. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి తెలుగుదేశం పార్టీలో చేరికతో నెల్లూరు జిల్లాలో సునాయాసంగా గెలవబోతున్నామన్నారు. యుద్ధానికి సై అంటూ అంతా ముందుకొస్తున్నారన్నారు. వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి అజాత శత్రువు అని చంద్రబాబు చెప్పారు. ప్రజలకు సేవే ఏకైక ఉద్దేశంతో వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి వచ్చారని గుర్తు చేశారు. నెల్లూరు కార్పోరేషన్ మొత్తం ఖాళీ అయిపోతోందన్నారు.

వైఎస్ఆర్‌సీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి వస్తున్న ప్రతి ఒక్కరికి స్వాగతం పలుకుతున్నామని చంద్రబాబు అన్నారు. న్యాయం కోసం పోరాడిన సమర్థ నాయకుడు వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డిని కొనియాడారు. రాజకీయాలకు గౌరవం తెచ్చే వ్యక్తులకు పార్టీలోకి స్వాగతిసున్నానన్నారు. రాష్ట్ర రాజకీయాల్లో సింహపురి రాజకీయాలకు ఎప్పుడూ ప్రత్యేకమేనని చెప్పారు. ప్రశ్నించిన వారిని వేధించడమే జగన్ పని అన్నారు. ప్రజా సేవకు అంకితమైన ఎవరినైనా పార్టీలోకి ఆహ్వానిస్తామన్నారు. అహంకారంతో రాష్ట్రాన్ని జగన్ విధ్వంసం చేశారని విమర్శించారు. జగన్ విధానాలు నచ్చకే స్వంత ఎంపీలు, ఎమ్మెల్యలు తిరుగుబాటు చేసే పరిస్థితికి వచ్చారని చెప్పారు .విశాఖపట్టణాన్ని దోచేసిన వ్యక్తిని వైఎస్ఆర్‌సీపీ నెల్లూరుకు పంపుతుందని విజయసాయి రెడ్డిపై చంద్రబాబు విమర్శలు చేశారు.

# పెండింగ్ పనులను త్వరితగతిన పూర్తి చేయాలి- కలెక్టర్ నారాయణరెడ్డి

హైదరాబాద్, మార్చి 2:జిల్లాలో వివిధ దశల్లో పెండింగ్ ఉన్న అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు జిల్లా కలెక్టర్ సి.నారాయణ రెడ్డి ఆదేశించారు. శనివారం టెలి కాన్ఫరెన్సు ద్వారా ప్రతి గ్రామ పంచాయతి బిల్డింగ్స్, స్కూల్స్ కాంపౌండ్ వాల్స్, కిచెన్ షెడ్స్ నిర్మాణ పనులు ఏవైతే ముందే ప్రారంభించి పూర్తి కాని పనులను సత్వరమే పూర్తి చేసి ఎఫ్ టి ఓ జనరేట్ చేయాలనీ అధికారులకు ఆదేశించారు.సిసి రోడ్ల నిర్మాణ పనులను ప్రతి రోజు టార్గెట్ పెట్టుకొని నాణ్యత తో పూర్తి చేసి పురోగతి లోకి తీసుకురావాలని ఆదేశించారు. మండలాల వారిగా సి సి రోడ్ల నిర్మాణ పనుల పురోగతికి సంబంధించి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

# స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇండెక్స్ 2023 విడుదల




న్యూఢిల్లీ, మార్చి 2:ఈ రోజు, మార్చి 1, 22 సంవత్సరాల క్రితం, భారత ఆర్థిక వ్యవస్థ యొక్క శక్తి తీవ్రతను తగ్గించే ప్రాథమిక లక్ష్యంతో, ఇంధన సంరక్షణ చట్టం, 2001లోని నిబంధనల ప్రకారం, భారత ప్రభుత్వ విద్యుత్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. అవును, దేశం శక్తి పరివర్తన వైపు అడుగులు వేస్తున్నందున, బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీ యొక్క 22వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఈరోజు, మార్చి 1, 2024న జరుపుకుంటున్నారు, ప్రధాన కార్యక్రమం దేశ రాజధానిలో నిర్వహించబడుతోంది.

"భారతదేశంలో విద్యుదీకరణ మరియు డీకార్బనైజేషన్ ద్వారా శక్తి పరివర్తన" అనే థీమ్‌గా ఉన్న 22వ వ్యవస్థాపక దినోత్సవ వేడుకలను కేంద్ర విద్యుత్ మరియు నూతన & పునరుత్పాదక ఇంధన శాఖ మంత్రి శ్రీ ఆర్.కె. సింగ్ ఘనంగా నిర్వహించారు. పవర్ సెక్రటరీ శ్రీ పంకజ్ అగర్వాల్; అదనపు కార్యదర్శి, విద్యుత్ మంత్రిత్వ శాఖ, శ్రీ అజయ్ తివారీ; చైర్‌పర్సన్, సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ, శ్రీ ఘనశ్యామ్ ప్రసాద్; మరియు డైరెక్టర్ జనరల్, బిఇఇ శ్రీ అభయ్ బక్రే కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా, కేంద్ర విద్యుత్ మరియు నూతన & పునరుత్పాదక ఇంధన మంత్రి బీఈఈ యొక్క రెండు ప్రమాణాలు మరియు లేబులింగ్ ప్రోగ్రామ్‌లను ప్రారంభించారు, ఒకటి ప్యాకేజ్డ్ బాయిలర్‌ల కోసం మరియు మరొకటి విసి కూలర్‌లుగా పిలువబడే వాణిజ్య పానీయాల కూలర్‌ల కోసం. అతను ఇండియా ఇఒ డైజెస్ట్ యొక్క ప్రారంభ ఎడిషన్ మరియు స్టేట్ ఎనర్జీ ఎఫిషియెన్సీ ఇండెక్స్ యొక్క ఐదవ ఎడిషన్‌ను కూడా విడుదల చేశాడు. సభను ఉద్దేశించి కేంద్ర మంత్రి బీఈఈని అభినందిస్తూ, బీఈఈ తన లక్ష్యానికి అనుగుణంగా జీవించడమే కాకుండా ఆశించిన దానికంటే ఎక్కువ చేసిందని అన్నారు. "ఃఇఇ అనేది మా కార్బన్ లోడ్‌ను గణనీయంగా తగ్గించిన సంస్థ. ఃఇఇ యొక్క ప్రయత్నాల ఫలితంగా భారతదేశం యొక్క ఇంధన వినియోగం దాదాపు 3.5% తగ్గింది, ఇది మనలాంటి దేశానికి చాలా పెద్దది. మీ ప్రయత్నాల ఫలితంగా సంవత్సరానికి 306 మిలియన్ టను ్నల కంటే ఎక్కువ కార్బన్ డయాక్సైడ్ ఉద్గారాలు తగ్గాయి. ఉఆఖ యొక్క ఉద్గార తీవ్రతను తగ్గించాలనే ౌఆఆ లక్ష్యాన్ని లక్ష్యం కంటే 11 సంవత్సరాల ముందుగానే భారత్ సాధించగలిగింది. బిఇఇ యొక్క పథకాలు మరియు కార్యక్రమాలు వినూత్నమైనవి, ప్రపంచ-ప్రము ఖమైనవి మరియు ప్రపంచవ్యాప్తంగా కాపీ చేయబడుతున్నాయి." మరిన్ని వినూత్న కార్యక్రమా లు చేపట్టనున్నామని మంత్రి తెలిపారు.

# జగిత్యాల జిల్లాలో కులబహిష్కరణ.. ఇరు వర్గాల మధ్య వివాదం

**- కత్తులు, రాళ్లతో పరస్పరం దాడులు..ఆరుగురికి తీవ్ర గాయాలు**

జగిత్యాల మార్చ్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: జగిత్యాల జిల్లా సారంగపూర్ మండలంలో గణేశ్‌పల్లిలో ఓ కుటుంబాన్ని కులబహిష్కరణ చేశారు. దీంతో ఇరు వర్గాల మధ్య వివాదం చెలరేగింది. కత్తులు, రాళ్లతో పరస్పరం దాడులు చేసుకున్నారు. ఈ ఘర్షణలో ఆరుగురికి తీవ్ర గాయాల య్యాయి. వారిని స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. సమాచారం అందుకున్న సారంగపూర్ పోలీసులు గణేశ్‌పల్లికి చేరుకుని, పరిస్థితిని సమీక్షించారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

# కాంగ్రెస్‌పై తపుడు ప్రచారాలు చేస్తే తరిమికొట్టాలి

**- కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చిన పరికపల్లి శ్రీనివాస్**

ఖమ్మం, మార్చి 2 :(నేటినిజం ప్రతినిధి): బీఆర్ఎస్, బీజేపీ వారు కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన పథకాలపై తప్పుడు ప్రచారం చేస్తే కాంగ్రెస్ నాయకులు తరిమికొట్టాలని కాంగ్రెస్ నేత పరికపల్లి శ్రీనివాస్ అన్నారు. శనివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...కాంగ్రెస్ ప్రవేశపెట్టిన పథకాలను డోర్ టు డోర్ తీసుకెళ్లి రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపే దిశగా పని చేయాలి అని కాంగ్రెస్ నాయకులకు పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పథకాలపై తప్పుడు కూతలు కూస్తున్నా వారిపై తగిన బుద్ధి చెప్పాలని చెప్పారు. గత 10 సం.లలో బీఆర్ఎస్ చేయని పని కేవలం 2నెలలో కాంగ్రెస్ పార్టీ చేసి చూపించింది అన్నారు. ముఖ్యంగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నిరుద్యోగులకు గ్రూప్ 1, డీఎస్సీ, పోలీస్, నర్సింగ్, వివిధ శాఖల్లో నోటిఫికేషన్ విడుదల చేసిన ఘనత కాంగ్రెస్ కి దక్కుతుంది అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చిన మాట తప్పదు అని గతంలో చెప్పిన విధంగా ఆరు పథకాలు అమలు చేస్తూ నేరుగా ప్రజలకు అందే విదంగా ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. అలాగే వైరా నియోజకవర్గంలో బీఆర్ఎన్ కార్యకర్తలు చేసిన అక్రమాలను త్వరలోనే కాంగ్రెస్ ఆధ్వర్యంలో బయట పెట్టి వారిపై చర్యలు తీసుకుంటాం అని చెప్పారు.

# దుద్దిల్ల పాదరావుకి ఘనంగా నివాళులు అర్పించిన అదనపు కలెక్టర్





ఖమ్మం, మార్చి 2 :(నేటినిజం ప్రతినిధి): మహనీయుల జీవితాల నుంచి మనం అనేక వ్యక్తిత్వ వికాస పాఠాలను నేర్చుకోవచ్చని అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్ అన్నారు. శనివారం అదనపు కలెక్టర్, నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో నిర్వహించిన స్వర్గీయ దుద్దిల్ల పాదరావు జయంతి వేడుకలలో పాల్గొన్నారు. దుద్దిల్ల పాదరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. జిల్లా ఉపాధికల్పన అధికారి కె. శ్రీరామ్, దుద్దిళ్ల పాదరావు జీవిత ప్రస్థానాన్ని చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...మారుమూల ప్రాంతమైన ధన్వాడలో పుట్టి శాసనసభ స్పీకర్ స్థాయికి ఎదిగిన మహనీయులు దుద్దిల పాదరావు అని, ప్రతి ఒక్కరితో మంచిగా వ్యవహరిస్తూ తన జీవితం కొనసాగించారని అన్నారు. న్యాయవాదిగా వృత్తి కొనసాగిస్తున్న సమయంలో ప్రజల ఆకాంక్షల మేరకు రాజకీయాల్లోకి వచ్చి సర్పంచ్ స్థాయి నుంచి శాసనసభ స్పీకర్ స్థాయికి ప్రజల ఆశీర్వాదంతో ఎదిగారని, నమ్ముకున్న సిద్ధాంతానికి కట్టుబడి ఉన్న వ్యక్తి పాదరావు అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసి ఎం. రాజేశ్వరి, జిల్లా వ్యవసాయ అధికారిణి విజయనిర్మల, జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి ఏ. శ్రీనివాస్, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా కోశాధికారి సత్యనారాయణ, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ, జీఎం ఇండస్ట్రీస్ అజయ్ కుమార్, ఏడి ఫిషరీస్ ఆంజనేయ స్వామి, కలెక్టరేట్ పరిపాలన అధికారిణి అరుణ, జిల్లా అధికారులు, కలెక్టరేట్ సూపరింటెండెంట్లు, వివిధ శాఖల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ మారిన ఎమ్మెల్సీలకు మరోసారి నోటీసులు..

అమరావతి, మార్చి 2:ఆంధ్రప్రదేశ్ లో ఇటీవల పార్టీలు మారిన ఎమ్మెల్యేలపై అసెంబ్లీ స్పీకర్ అనర్హత వేటు వేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలోనే వివిధ పార్టీలకు చెందిన పలువురు ఎమ్మెల్సీలకు సైతం మండలి చైర్మన్ నోటీసులు జారీ చేశారు .కానీ ఇంతవరకు ఎవరూ స్పందించలేదు.

తాజాగా శనివారం పార్టీ మారిన ఎమ్మెల్సీలకు మండలి చైర్మన్ మోషేన్ రాజు మరోసారి నోటీసులు జారీ చేశారు. ఈ నెల 5న తుది విచారణకు హాజరు కావాలని ఎమ్మెల్సీలు వంశీ కృష్ణ యాదవ్, రామచంద్రయ్యకు శాసన మండలి నోటీసుల్లో పేర్కొంది. అలాగే ఈ తుది విచారణకు హాజరు కాకుంటే తాము తీసుకోవాల్సిన నిర్ణయం తీసుకుంటామని నోటీసుల్లో స్పష్టంగా వెల్లడించారు.

కాగా, పార్టీ ఫిరాయించిన 8 మంది శాసన సభ్యులపై స్పీకర్ తమ్మినేని సీతారాం అనర్హత వేటు వేశారు. వీరిలో వైఎస్సార్‌సీపీ నుంచి నలుగురు, టీడీపీ నుంచి నలుగురు ఉన్నారు. వైఎస్సార్‌సీపీ నుంచి శాసనసభకు ఎన్నికై పార్టీ ఫిరాయి ంచిన కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి (నెల్లూరు రూరల్ నియోజకవర్గం), ఆనం రామనారాయణరెడ్డి (వెంకటగిరి), మేకపాటి చంద్రశేఖరరెడ్డి (ఉదయగిరి), ఉండవల్లి శ్రీదేవి (తాడికొండ)పై ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం అనర్హత వేటు వేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ చీఫ్ విప్ ముదునూరు ప్రసాదరాజు స్పీకర్‌కు ఫిర్యాదు చేశారు.

# మల్లికార్జున ఖర్గే నేత జైరాం రమేశ్ లకు నితిన్ గడ్కరీ లీగల్ నోటీసులు

న్యూ డిల్లీ మార్చ్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);కాంగ్రెస్ నేతలకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ లీగల్ నోటీసులు పంపారు. ఓ ఇంటర్వ్యూలో తాను మాట్లాడిన మాటలకు సంబంధించిన వీడియోను వక్రీకరించి ప్రజల్లో గందరగోళం సృష్టించే ప్రయత్నం చేశారంటూ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సీనియర్ నేత జైరాం రమేశ్ లకు నితిన్ గడ్కరీ లీగల్ నోటీసులు పంపించారు. కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ ఓ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో 19 సెకన్ల క్లిప్పింగ్‌ను కాంగ్రెస్ పార్టీ 'ఎక్స్' వేదికగా షేర్ చేసింది. గ్రామస్థులు, పేదలు, కూలీలు, రైతులు సంతృప్తికరంగా లేరు. గ్రామాల్లో మంచి రోడ్లు లేవు, తాగునీరు, మంచి ఆసుపత్రులు, పాఠశాలలు అందుబాటులో లేవు అంటూ గడ్కరీ వీడియోలో అన్నారు. అయితే, కాంగ్రెస్ షేర్ చేసిన ఆ వీడియో క్లిప్‌పై గడ్కరీ అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ ప్రభుత్వ హయాంలో తీసుకుంటున్న చర్యల గురించి తాను చేసిన ప్రసంగాన్ని వక్రీకరించి కాంగ్రెస్ పార్టీ ఈ పోస్ట్ పెట్టిందని ఆగ్రహం వ్యక్తం చేశారు.సందర్భం ఉద్దేశాన్ని బయటపెట్టకుండా అర్థం మారేలా ఆ క్లిప్పింగ్‌లో మార్పులు చేశారని మండిపడ్డారు. ప్రజల్లో గందరగోళం సృష్టించేందుకు, నన్ను కించపరిచేందుకు కాంగ్రెస్ నేతలు ప్రయత్నించారని అన్నారు. ఈ మేరకు తన లాయర్ ద్వారా ఖర్గే, జైరాం రమేశ్‌కు లీగల్ నోటీసులు పంపినట్లు చెప్పారు. నోటీసులు అందిన 24 గంటల్లో ఆ వీడియో క్లిప్‌ను డిలీట్ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మూడు రోజుల్లో తనకు రాతపూర్వకంగా క్షమాపణలు చెప్పాలని నోటీసుల్లో పేర్కొన్నారు.

# పోటీ నుంచి తప్పుకున్న టీడీపీ అభ్యర్థి మహాసేన రాజేశ్

అమరావతి, మార్చి 2: టీడీపీ అధినేత చంద్రబాబు అభ్యర్థులను ప్రకటించి వారం రోజులు కూడా గడవకముందే ఒక వికెట్ డౌన్ అయింది. అంబేద్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం తెలుగు దేశం అభ్యర్థి మహాసేన రాజేశ్ పోటీ నుంచి తప్పుకున్నారు. ఈ మేరకు ఆయన తప్పుకుంటున్నట్లు సంచలన ప్రకటన చేశారు. ఇటీవలే చంద్రబాబు-పవన్ కల్యాణ్ కలిసి టీడీపీ, జనసేన అభ్యర్థుల్ని ప్రకటించారు. టీడీపీ నుంచి పి.గన్నవరం అభ్యర్థిగా మహాసేన రాజేశ్‌కు అవకాశం కల్పించారు. కానీ స్థానిక టీడీపీ, జనసేన నేతల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైంది. అంతేకాకుండా పలు కుల సంఘాలు కూడా ఆయన అభ్యర్థిత్వాన్ని తప్పుపట్టాయి. ఈ నేపథ్యంలో ఆయన అసెంబ్లీ ఎన్నికల పోటీ నుంచి తప్పుకుంటున్నట్లు వెల్లడించారు.

ఒక సామాన్యుడికి అవకాశం రాగానే వ్యవస్థ మొత్తం ఏకమైందని రాజేశ్ ఆవేదన వ్యక్తం చేశారు. కులరక్కసి చేతిలో బలైపోయానని.. తన వల్ల పార్టీకి చెడ్డపేరు రావొద్దనే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు రాజేశ్ చెప్పుకొచ్చారు. హిందువుల గురించి రాజేశ్ అసభ్యకర వ్యాఖ్యలు చేశారని, అతడిని తప్పించాలని విశ్వహిందూ పరిషత్, రామసేన, బ్రాహ్మణ సంఘాలు ఆందోళన చేపట్టాయి. జగన్మాత పార్వతీ దేవిని కించపరుస్తూ సోషల్ మీడియా వేదిక రాజేష్ ప్రచారం చేసినట్లు హిందూ సంఘాలు తప్పుపట్టాయి. సోషల్ మీడియా వేదికగా హిందూ సంఘాలు తప్పు పట్టడంతో వారి ఆందోళనలకు తలొగ్గి పోటీ నుంచి తప్పుకుంటు న్నానని రాజేశ్ ప్రకటించారు.

# ఉత్తరప్రదేశ్‌లోని జౌన్‌పూర్‌లో రూ. 10,000 కోట్ల విలువైన 10 జాతీయ రహదారుల ప్రాజెక్టులకు నితిన్ గడ్కరీ శంకుస్థాపన



న్యూఢిల్లీ, మార్చి 2:జౌన్‌పూర్‌లో రూ. 10,000 కోట్లతో 10 జాతీయ రహదారుల ప్రాజెక్టులకు కేంద్ర రోడ్డు రవాణా & రహదారుల శాఖ మంత్రి శ్రీ నితిన్ గడ్కరీ ఈరోజు శంకుస్థాపన చేశారు. రాష్ట్ర మంత్రి శ్రీ గిరీష్ చంద్ర యాదవ్, మంత్రి శ్రీ దయాశంకర్ సింగ్, పార్లమెంటు సభ్యులు, శ్రీమతి. ఈ కార్యక్రమంలో సీమా ద్వివేది, శ్రీ పుష్పరాజ్ సింగ్, ఎమ్మెల్యేలు, అధికారులు పాల్గొన్నారు.

శ్రీ నితిన్ గడ్కరీ మాట్లాడుతూ, జౌన్‌పూర్ నగరంలో 2 బైపాస్‌ల నిర్మాణం, రింగ్ రోడ్డు పూర్తవుతుందని, ఇది జౌన్‌పూర్‌కు ట్రాఫిక్ జామ్‌ల నుండి ఉపశమనం కలిగించి పారిశ్రామిక అభివృద్ధికి ప్రోత్సహిస్తుంది.

రోడ్డు రవాణా మరియు రహదా రుల మంత్రిత్వ శాఖ దేశవ్యాప్తంగా బహుళ-మోడల్ కనెక్టివిటీ మరియు చివరి మైలు కనెక్టివిటీని మెరుగుపరచడానికి ఉద్దేశించిన ఖఽ గతిశక్తి నేషనల్ మాస్టర్ ప్లాన్ కింద గణనీయమైన పురోగతిని సాధించింది. ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్, జౌన్‌పూర్ మరియు అజంగఢ్ జిల్లాల్లో ఉన్న ప్రయాగ్‌రాజ్-దోహ్రీఘాట్ కారిడార్ ప్రాజెక్ట్ అలాంటి వాటిలో ఒకటి. ఈ మొత్తం కారిడార్‌ను 4-లేన్‌లతో నిర్మిస్తున్నారు.

మొత్తం 4 ప్యాకేజీలలో నిర్మించిన ఈ ప్రాజెక్ట్ పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే, 11 జాతీయ రహదారులు, 2 రాష్ట్ర రహదారులు, 5 రైల్వే స్టేషన్లు, 2 విమానాశ్రయాలను కలుపుతుంది. ఈ ప్రాజెక్ట్ రోడ్డు నిర్మాణం వల్ల ఈ 5 ముఖ్యమైన వాణిజ్య నగరాలైన ఫుల్‌పూర్, ముంగరాబాద్‌పూర్, మచిలిషహర్, జౌన్‌పూర్ మరియు అజంగఢ్‌లలో ట్రాఫిక్ సమస్యలు తగ్గుతాయి. ఈ ప్రతిష్టాత్మక ప్రాజెక్ట్ అతుకులు లేని కనెక్టివిటీని అందించడంతోపాటు భారీ ఆర్థిక ప్రయోజనాలను సృష్టించడం మరియు వినియోగదారులు, రైతులు, యువత మరియు వ్యాపారవేత్తలకు ఉపాధిని పెంచడం లక్ష్యంగా పెట్టుకుంది.

# దామోదర్ రావు మాతృమూర్తి పార్థివదేహానికి నివాళులర్పించిన కేటీఆర్



హైదరాబాద్, మార్చి 2 :రాజ్య సభ సభ్యులు దీవకొండ దామోదర్ రావు మాతృమూర్తి ఆండాళమ్మ మృతిపట్ల బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సంతాపం ప్రకటించారు. ఈ సందర్భంగా బంజారాహిల్స్‌లోని దామోదర్ రావు స్వగృహంలో ఆండాళమ్మ పార్థివదేహానికి కేటీఆర్ నివాళులర్పించారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. దామోదర్‌రావుతో పాటు కుటుంబ సభ్యులను కేటీఆర్ పరామర్శించారు.

విజ్ఞాన సరోవర ప్రచురణలు మరియు
తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంయుక్త
ఆధ్వర్యంలో
ఎస్.ఎమ్. ప్రాణ్‌రావు రచించిన
మలగని బత్తి (నవలాత్రయం-Trilogy)
ఆవిష్కరణ సభ
ముఖ్య అతిథి మరియు ఆవిష్కరణ
ప్రొఫెసర్ కోదండరాం
తెలంగాణ ఉద్యమ నాయకుడు




అధ్యక్షులు : ఏనుగు నరసింహా రెడ్డి
విశిష్ట అతిథి : మామిడి హరికృష్ణ
ప్రత్యేక అతిథి : బి. మల్లేశ్వర రెడ్డి
ఆత్మీయ వక్తలు : కె.పి. అశోక్ కుమార్
పి. జ్యోతి
చింతపట్ల సుదర్శన్
స్వాగతం : సుధా శ్రీనివాస రావు
తేది. 4.3.2024 సోమవారము సా॥ 6.00 గం॥లకు
సభాస్థలి: రవీంద్ర భారతి మినీ హాల్ - హైదరాబాద్.
అందరూ ఆత్మీయ ఆహ్వానితులే...

# KVIC మహారాష్ట్రలోని నాసిక్‌లో గ్రామీణ కళాకారులకు శిక్షణ మరియు అధిక-నాణ్యత యంత్రాలు మరియు టూల్‌కిట్‌ల పంపిణీ



న్యూఢిల్లీ, మార్చి 2:గౌరవనీయులైన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దృష్టిలో 2047 నాటికి 'అభివృద్ధి చెందిన మరియు ఆత్మనిర్భర్ భారత్' నిర్మాణ లక్ష్యాన్ని సాధించడానికి, ఖాదీ మరియు గ్రామ పరిశ్రమల కమిషన్ (ఐఎఎ), సూక్ష్మ, చిన్న మరియు మధ్య తరహా పరిశ్రమల మంత్రిత్వ శాఖ, భారత ప్రభుత్వం మంగళవారం ఆధునిక శిక్షణ అనంతరం మహారాష్ట్రలోని కళాకారులకు నాణ్యమైన టూల్‌కిట్‌లను పంపిణీ చేశారు. నాసిక్ జిల్లాలోని సాత్పూర్ లోని త్రయంబక్ రోడ్‌లో ఉన్న డెమోక్రసీ కన్వెన్షన్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన పంపిణీ కార్యక్రమంలో, ముఖ్య అతిథిగా, ఐఎఎ చైర్మన్ శ్రీ మనోజ్ కుమార్ 240 మంది కళాకారులకు 449 యంత్రాలు మరియు టూల్‌కిట్‌లను మరియు గ్రామ ఉద్యోగ వికాస్ యోజన కింద 250 మంది ట్రైనీలకు సర్టిఫికేట్‌లను పంపిణీ చేశారు. శిక్షణ అనంతరం తొలిసారిగా 20 మంది మహిళలకు ఎలక్ట్రీషియన్ టూల్‌కిట్ పంపిణీ చేయడం ఈ పంపిణీ కార్యక్రమంలో ప్రత్యేకత. ఈ మహిళలందరూ శ్రీరాంపూర్, అహ్మద్‌నగర్‌లో శిక్షణ పొందారు.

వ్యవసాయ రంగంలో పరిశోధన ఢ నైపుణ్యాభివృద్ధి కోసం 2015 జూన్ 28న హజారీబాగ్ జిల్లాలోని గౌరియా కర్మ గ్రామంలో 1000 ఎకరాల విస్తీర్ణంలో ఎంఖీఎ జార్ఖండ్‌కు ప్రధాని శంకుస్థాపన చేశారని ప్రతీతి అర్జున్ ముండా తెలిపారు. ఈ సంస్థ ఆహార ధాన్యాలు, నూనెగింజలు, పప్పుధాన్యాలు, హార్టికల్చర్, అటవీ, పాడిపరిశ్రమ, పశువుల పెంపకం, చేపల పెంపకం మొదలైన వాటిపై పరిశోధనలను కేంద్రీకరిస్తుంది మరియు ఈ రంగాలలో కూడా విద్యను అందజేస్తుంది, ప్రస్తుతం 110 మంది విద్యార్థులు వివిధ విభాగాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ డిగ్రీని పొందారు మరియు ప్రస్తుతం 240 మంది విద్యార్థులు చదువుతున్నారు. (వ్యవసాయం) దేశంలోని వివిధ ప్రాంతాల నుండి.

1960వ దశకంలో ప్రారంభమైన హరిత విప్లవం దేశీయ ఆహారోత్పత్తిలో గొప్ప పురోగతిని సాధించేలా చేసిందని మరియు వ్యవసాయం మరియు అనుబంధ రంగాలలో పురోగతికి గణనీయంగా దోహదపడిందని శ్రీ ముండా ఉద్ఘాటించారు. ఇది భారతదేశాన్ని ఆహార లోటు దేశం నుండి ఆహార మిగులు దేశంగా మార్చింది. మన తూర్పు రాష్ట్రాలు హరిత విప్లవం యొక్క ఫలాలను పండించలేకపోయాయని మరియు దేశంలోని ఇతర ప్రాంతాలలో వలె వ్యవసాయం మరియు అనుబంధ రంగాలలో పురోగతి సాధించలేదని ఆయన నొక్కిచెప్పారు, అందువల్ల ఈ సంస్థ తూర్పు భాగస్వామ్య వ్యవసాయ అభివృద్ధికి కేంద్ర బిందువుగా మారడానికి అంకితం చేయబడింది. సేంద్రీయ మరియు సహజ వ్యవసాయ పద్ధతుల ఆధారంగా దేశంలో రెండవ హరిత విప్లవానికి రాష్ట్రాలు శ్రీకారం చుట్టాయి. ఈ సంస్థ సహకారంతో విత్తన గ్రామ కార్యక్రమంలో పాల్గొనడం ద్వారా దేశీయంగా అభివృద్ధి చేసిన నానో యూరియాను ఉపయోగించాలని మరియు నాణ్యమైన విత్తనాలను ఉత్పత్తి చేయాలని కేంద్ర మంత్రి రైతులను ప్రోత్సహించారు. వ్యవసాయం మరియు అనుబంధ రంగాలతో సహా ప్రతి రంగంలో ఆవిష్కరణలను అనుసరించాలనే ప్రధాన మంత్రి దృష్టిని ఆయన హైలైట్ చేశారు మరియు రైతులకు 23 కోట్ల సాయిల్ హెల్త్ కార్డులు అందించబడ్డాయి మరియు ప్రభుత్వం ప్రతి మూడు సంవత్సరాలకు పునరుద్ధరించబడుతుంది. ఇక్కడ పనిచేస్తున్న శాస్త్రవేత్త గ్లోబల్ వార్మింగ్, క్లైమేట్ ఛేంజ్ మొదలైన ప్రస్తుత సవాళ్లను తగ్గించడానికి పరిష్కారాన్ని కనుగొనడానికి ప్రయత్నిస్తారు మరియు దేశంలోని తూర్పు ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ప్రధానమంత్రి కలను కూడా నెరవేరుస్తారు. "ఏక్ భారత్ శ్రేష్ఠ భారత్" కోసం మనం అందరం కలిసి పని చేద్దాం అంటూ తన ప్రసంగాన్ని ముగించారు.

హస్తకళాకారులతో నేరుగా కమ్యూనికేట్ చేస్తూ, KVIC, చైర్మన్ శ్రీ మనోజ్ కుమార్ మాట్లాడుతూ, గ్రామ ఉద్యోగ వికాస్ యోజన కింద, KVIC, ఇప్పటివరకు దేశవ్యాప్తంగా 27 వేల మందికి పైగా కుమ్మరి సోదరులు మరియు సోదరీమణులకు ఎలక్ట్రిక్ ఆపరేటెడ్ వీల్‌ను పంపిణీ చేసిందని, తద్వారా 1 లక్ష మందికి పైగా కుమ్మరులకు సహాయం చేశామని చెప్పారు. వారి జీవితంలో పెద్ద మార్పు వచ్చింది. ఇదే పథకం కింద గ్రామాల్లో నివసిస్తున్న చేతివృత్తిదారులకు 6000కు పైగా టూల్‌కిట్‌లు, యంత్రాలను పంపిణీ చేయగా, హనీ మిషన్ పథకం కింద ఇప్పటివరకు 20 వేల మందికి పైగా లబ్ధిదారులకు 2 లక్షలకు పైగా బీ-బాక్సులు, బీ-కాలనీలు పంపిణీ చేశారు. .

శ్రీ మనోజ్ కుమార్ తన అధ్యక్ష ప్రసంగంలో, మోదీ ప్రభుత్వ హామీలు ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమ ఉత్పత్తులను ప్రపంచ వ్యాప్తంగా ప్రాచుర్యం పొందాయని ఉద్ఘాటించారు. గత 9 సంవత్సరాలలో, 'నయే భర్త కి నయా ఖాదీ' 'ఆత్మనిర్భర్ భారత్ క్యాంపెయిన్'కి కొత్త దిశానిర్దేశం చేసింది, దీని ఫలితంగా, ఈ కాలంలో ఖాదీ ఉత్పత్తుల అమ్మకాలు నాలుగు రెట్లు ఎక్కువ నమోదు అయ్యాయి. ఖాదీ ఉత్పత్తి మరియు అమ్మకాల పెరుగుదలతో, గ్రామీణ భారతదేశంలోని కళాకారులు ఆర్థికంగా అభివృద్ధి చెందారు. గత 9 ఏళ్లలో చేతివృత్తుల వారి వేతనం 233 శాతానికి పైగా పెరగడం వల్ల చేతివృత్తుల వారు ఖాదీ పని వైపు ఆకర్షితులవుతున్నారని ఆయన వివరించారు. ఈ సందర్భంగా కేవీఐసీ చైర్మన్ శ్రీ మనోజ్ కుమార్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 'వోకల్ ఫర్ లోకల్', 'మేక్ ఇన్ ఇండియా' మంత్రాల వల్ల యువత ఖాదీకి ఆదరణ లభించిందన్నారు. గత 9 సంవత్సరాలలో, ఖాదీ మరియు గ్రామీణ పరిశ్రమల ఉత్పత్తుల టర్నోవర్ రూ.1.34 లక్షల కోట్లను దాటింది, ఈ కాలంలో 9.50 లక్షలకు పైగా కొత్త ఉద్యోగాలు సృష్టించబడ్డాయి.

పంపిణీ కార్యక్రమంలో, ఖాదీ సంస్థల ప్రతినిధులు, ఖాదీ కార్మికులు మరియు కళాకారులు, గ్రామ ఉద్యోగ వికాస్ యోజన లబ్దిదారులు, బ్యాంకుల ప్రతినిధులు, KVIC, KVIB మరియు మహారాష్ట్ర ప్రభుత్వ అధికారులు మరియు ఉద్యోగులు పాల్గొన్నారు.

## రామేశ్వరం కేఫ్‌లో పేలుడు సంబంధించి ధృవీకరించని వ్యాఖ్యలు చేయరాదు

**-సీఎం సిద్ధరామయ్య, బెంగళూర్ పోలీస్ కమిషనర్‌లకు కేంద్ర మంత్రి విజ్ఞప్తి**

బెంగళూర్ మార్చ్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్);బెంగళూర్‌లోని రామేశ్వరం కేఫ్‌లో పేలుడు ఘటనకు సంబంధించి ధృవీకరించని వ్యాఖ్యలు చేసి దర్యాప్తును ప్రభావితం చేసేలా కర్నాటక మంత్రులు వ్యవహరించరాదని కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ పేర్కొన్నారు. దర్యాప్తును ప్రభావితం చేసేలా ఎలాంటి వ్యాఖ్యలు చేయకుండా మంత్రులను నిలువరించాలని సీఎం సిద్ధరామయ్య, బెంగళూర్ పోలీస్ కమిషనర్‌లకు కేంద్ర మంత్రి విజ్ఞప్తి చేశారు. గ్యాస్ సిలిండర్ పేలడం వల్లే పేలుడు జరిగిందని, రాజకీయ శత్రుత్వమే ఇందుకు కారణమని పేర్కొనడం వంటి రాష్ట్ర మంత్రుల ప్రకటనలు దర్యాప్తును ప్రభావితం చేస్తాయని కేంద్ర మంత్రి ఆందోళన వ్యక్తం చేశారు. ఊహాగానాలకు దూరంగా ఉండాలని బెంగళూర్ పోలీస్ కమిషనర్ బి దయానంద మీడియాకు చేసిన వినతి నేపథ్యంలో కేంద్ర మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఈ వ్యాఖ్యలు చేశారు. రామేశ్వరం కేఫ్ ఘటనకు సంబంధించి దర్యాప్తు వేగవంతంగా సాగుతోందని, పలు బృందాలు దీనిపై పనిచేస్తున్నాయని, కేసు సున్నితత్వం, భద్రతా ఆందోళనల దృష్ట్యా మీడియా ఊహాగానాలు వ్యాప్తి చేయకుండా సహకరించాలని కమిషనర్ ట్వీట్ చేశారు.మరోవైపు ఈ ఘటనను రాజకీయం చేయవద్దని విపక్షాలకు కర్నాటక సీఎం సిద్ధరామయ్య విజ్ఞప్తి చేశారు. ఇక ఈ ఘటనకు సంబంధించి లేటెస్ట్ సీసీటీవీ ఫుటేజ్ బయటకు వచ్చింది. పేలుడు అనుమానితుడు పేలుడు పదార్ధాలతో కూడిన బ్యాగ్‌తో కేఫ్ వైపు నడుచుకుంటూ వెళుతున్న దృశ్యాలు కనిపించాయి. అనుమానితుడు యువకుడని అతడి వయసు 28 నుంచి 30 ఏండ్లు ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. అనుమానితుడిని అదుపులోకి తీసుకునేందుకు పలు పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి.

# పరామర్శలతో పొంగులేటి ప్రసాద్ రెడ్డి పర్యటన ప్రారంభం



ఖమ్మం, మార్చి 2 :(నేటినిజం ప్రతినిధి): కాంగ్రెస్ జిల్లా నాయకులు పొంగులేటి ప్రసాద్ రెడ్డి నేలకొండపల్లి మండలం నుంచి శనివారం ఉభయ జిల్లాల పర్యటన ప్రారంభించారు. తొలుత ముజ్జుగూడెం గ్రామంలో తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న రేగుల చిన్నమల్లయ్య భార్యను పరామర్శించారు. మెరుగైన వైద్యం కోసం రాష్ట్ర మంత్రి పొంగులేటి శీనన్న దృష్టికి తీసుకెళ్తానని, ధైర్యంగా ఉండాలని అభయం ఇచ్చారు. ఇదే గ్రామంలో షేక్ కన్నాం సాబ్, జాన్ బీలను, మరో ఇంట వికలాంగ చిన్నారిని పరామర్శించారు. అనంతరం అనాసాగరంలో సళ్ళంగుండ సావిత్రమ్మ, గూనగుంట్ల వెంకయ్య, అనంత రామయ్యల ఇళ్లకు వెళ్లి వారిని ఓదార్చారు. ఆ తర్వాత సదాశివపురంలో అనారోగ్యంతో బాధ పడుతున్న ఎంగ్రాతి ప్రమీల, వీఆర్‌ఏ నోచిన రోశయ్యలను పరామర్శించారు. ఆయా కుటుంబాలకు ఆర్థిక సాయం అందించారు. ఏ ఆపద వచ్చినా అండగా ఉంటామని అన్నారు. ఈ కార్యక్రమాల్లో ఎంపీపీ వజ్జా రమ్య, కాంగ్రెస్ నాయకులు నెల్లూరి భద్రయ్య, కొడాలి గోవిందరావు, శాఖమూరి రమేష్, వెన్నపూసల సీతారాములు, గూడవల్లి రాంబ్రహ్మం, కుక్కల హనుమంతరావు, మహిషా శంకర్, మట్టా దుర్గారెడ్డి, ఎడవల్లి సైదులు, జగ్రిపోతుల అంజని, బచ్చలిపుర నాగరాజు, మరికంటి వి రాణి, రమేష్, కొత్తకోళ్ల సుధాకర్, బోయిన వేణు తదితరులున్నారు.

# యోగనరసింహుడి అలంకారంలో కల్యాణ వేంకటేశ్వరస్వామి దర్శనం



తిరుపతి, మార్చి 2 : శ్రీనివాస మంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో మూడో రోజు శనివారం శ్రీనివాసుడు యోగనరసింహుడి అలంకారంలో సింహ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. వాహనం ముందు వృషభాలు, గజరాజులు నడుస్తుండగా, భక్తజన బృందాలు చెక్కభజనలు, కోలాటాలతో స్వామివారిని కీర్తించారు.

మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి స్వామివారిని దర్శించుకున్నారు. శనివారం రాత్రి 7 నుంచి 8 గంటల వరకు స్వామివారు ముత్యపుపందిరి వాహనంపై కటాక్షిస్తారని అధికారులు తెలిపారు.

సూర్యప్రభ వాహనంపై కపిలేశ్వరస్వామివారి కటాక్షం

కపిలేశ్వరస్వామివారి బ్రహ్మోత్సవాల్లో రెండో రోజు శనివారం కపిలేశ్వర స్వామివారు సూర్యప్రభ వాహనంపై దర్శనమిచ్చారు. అనంతరం స్నపన తిరుమంజనం ఘనంగా జరిగింది. సోమస్కందమూర్తి,కా

# పిఠాపురం కేంద్రంగా వైసీపీ నయా పాలిటిక్స్.. పవన్ కళ్యాణ్‌కు పోటీగా ముద్రగడ బరిలోకి!

అమరావతి, మార్చి 2: ఏపీలో రాజకీయ సమీకరణాలు వేగంగా మారుతున్నాయి. పిఠాపురం కేంద్రంగా కొత్త పాలిటిక్స్ తెరలేస్తున్నాయి. గత ఎన్నికల్లో ఘోర పరాజయం పాలైన జనసేన అధినేత పవన్ కళ్యాణ్.. ఈసారి పిఠాపురం నుంచి బరిలో దిగాలని చూస్తున్నారు. గెలుపు అంచనాలు అన్నింటినీ బేరీజు వేసుకుని జనసేనాని ఈ నిర్ణయం తీసుకున్నారు. కానీ పిఠాపురంలో గెలుపు అంత ఈజీగా దక్కేలా కనిపించడం లేదు. పవన్‌ను ఓడించే ఏ ఛాన్స్‌ను విడిచిపెట్టని వైసీపీ.. ముద్రగడను బరిలోకి దించాలని యోచిస్తోన్నట్లు తెలుస్తోంది.

పవన్ కళ్యాణ్‌తో కలిసి నడవాలని కాపు నేత ముద్రగడ పద్మనాభం ముందు నుంచి అనుకున్నారు. కానీ టీడీపీతో పొత్తు పెట్టుకోవడం.. సీట్ల పంపకంలోనూ రాజీ పడటం ముద్రగడకు నచ్చలేదు. పవర్ షేరింగ్ అడగకుండా 24 అసెంబ్లీ స్థానాలకే పరిమితం కావడాన్ని ఇటీవల ఆయన బహిరంగంగా కూడా విమర్శించారు. ఇది కాకుండా మొదట్నుంచి కూడా ముద్రగడకు పవన్ సరైన రెస్పాన్స్ ఇవ్వలేదు. ముద్రగడను ప్రత్యేకంగా కలుస్తానని పలుమార్లు హామీ ఇచ్చిన పవన్ మాట తప్పారు. ఈ తీరు పవన్‌పై ఆగ్రహానికి కారణమయ్యాయి. దీన్ని ముద్రగడ వర్గం ఆయనకు జరిగిన అవమానంగా భావించాయి. ఈ క్రమంలోనే జనసేనలో చేరవద్దని ముద్రగడ ఫిక్సయినట్లు తెలుస్తోంది. ఈ విషయంపై జనసేన నేత బన్నీ వాసు ముద్రగడ ఇంటికి వెళ్లి చర్చలు జరిపారు. నచ్చజెప్పేందుకు ఎంత ప్రయత్నించినప్పటికీ ముద్రగడ తన నిర్ణయం మార్చుకోలేదని విశ్వసనీయ సమాచారం. జనసేనతో ముద్రగడకు చెడిందని తెలియడంతో వైసీపీ నేతలు రంగంలోకి దిగారు.

కాపు ఉద్యమ నేత అయిన ముద్రగడను తమ పార్టీలో చేర్చుకోవడం ద్వారా పవన్ కళ్యాణ్‌కు చెక్ పెట్టాలని వైసీపీ యోచిస్తున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే పిఠాపురం నుంచి పవన్‌పై ముద్రగడను బరిలో దించాలని ప్లాన్ చేస్తోంది. ముద్రగడ అయితేనే పవన్‌పై బలమైన అభ్యర్థి అవుతారని అనుకుంటున్నది. అయితే ఇప్పటికే పిఠాపురం వైసీపీ ఇన్‌చార్జిగా వంగా గీతను వైఎస్ జగన్ నియమించారు. ఈ క్రమంలో వంగా గీతను సీఎంవోకు పిలిపించుకుని చర్చలు జరిపినట్లు తెలుస్తోంది. ఈ భేటీలో గీత కూడా ముద్రగడ పార్టీలోకి వస్తే తప్పుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది.

# దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుల్లో పీవీ నరసింహారావు ఒకరు: ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్




హైదరాబాద్, మార్చి 2 : దేశం గర్వించదగ్గ గొప్ప నాయకుల్లో మాజీ ప్రధానమంత్రి పీవీ నర్సింహా రావు ఒకరని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇటీవల పీవీ నర్సింహారావు కు భారతరత్న ప్రకటించిన సందర్భంగా శనివారం బేగంపేటలోని పీవీ నర్సింహారావు భవన్‌లో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అంతకు ముందు పీవీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం పీవీ ఫోటో ప్రదర్శనను ప్రారంభించారు. ఈ సందర్భంగా తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడుతూ పీవీ నర్సింహా రావు కు భారతరత్న ప్రకటించిన ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. దేశానికి చేసిన సేవలకు గుర్తింపుగా లభించిన గౌరవం భారత రత్న అని పేర్కొన్నారు. మంత్రిగా, ముఖ్యమంత్రిగా, ప్రధానిగా ఎంతో విశేషమైన సేవలు అందించారని గుర్తుచేశారు. ఆర్థిక సంస్కరణలు తీసుకొచ్చి దేశాన్ని అభివృద్ధి పథంలో నడిపిన ఘనత పీవీకే దక్కుతుందన్నారు. తన పరిపాలన దక్షతతో ప్రపంచ దేశాలలో భారతదేశ ఖ్యాతిని చాటి చెప్పారని, అలాంటి మహనీయుడికి భారతరత్న ప్రకటించాలని కేంద్ర ప్రభుత్వాన్ని బీఆర్ఎస్ అనేక సార్లు డిమాండ్ చేసిన విషయాన్ని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో పీవీ కుమార్తె, ఎమ్మెల్సీ సురభి వానిదేవి, కుమారుడు ప్రభాకర్ రావు, కార్పొరేటర్ టి.మహేశ్వరి, గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

# మహాబలిపురం సముద్రంలో ఇద్దరు ఏపీ విద్యార్థుల గల్లంతు

అమరావతి, మార్చి 2: విహారయాత్రకు బయలుదేరిన విద్యార్థుల్లో ఇద్దరు గల్లంతైన విషాదఘటన చోటు చేసుకుంది. అనంతపురం జిల్లా యాడికిలోని పెన్నా సిమెంట్స్ కళాశాలకు చెందిన సుమారు 22 మంది విద్యార్థులు రెండు రోజుల క్రితం విహారయాత్రకు బయలుదేరారు. శనివారం తమిళనాడులోని మహాబలి పురానికి చేరుకుని సముద్రతీరానికి చేరుకున్నారు. కొంత మంది విద్యార్థులు సముద్రంలోకి దిగగా ఇద్దరు ప్రమాదవశాత్తు అలల తాకిడికి కొట్టుకుపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు స్థానిక గజ ఈతగాళ్ల సహాయంతో గల్లంతైన విద్యార్థులు శేషారెడ్డి, పెద్దిరాజు కోసం గాలింపు చర్యలు ప్రారంభించారు.

# కష్టాల కాంగ్రెస్.. రద్దయిన నోటు కేసీఆర్ : ఈటెల



జనగామ, మార్చి 2: కాంగ్రెస్ అంటేనే కరెంటు కోతలు రైతులకు కష్టాలు వస్తాయని.. కేసీఆర్ రద్దయిన నోటులాంటి వారని, అందుకే దేశ సంక్షేమం కోసం రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో ప్రధాని మోదీని ఆశీర్వదించాలని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఈటెల రాజేందర్ అన్నారు.

జనగామ జిల్లాలో జిల్లా అధ్యక్షుడు ఆరుట్ల దశమంత రెడ్డి అధ్యక్షతన జరిగిన బీజేపీ విజయ సంకల్ప యాత్రకు మాజీ ఎమ్మెల్యే బీజేపీ జాతీయ కమిటీ సభ్యులు ఈటెల రాజేందర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ దేశంలో ప్రజల కష్టసుఖాల గురించి ఆలోచిస్తున్నారని, పేదలకు అండగా ఉంటూ అట్టడుగు వర్గాల అభివృద్ధికి నిరంతరం సంక్షేమ పథకాలు అందజేస్తున్నారన్నారు.

దేశంలోనే భాజపా ప్రభుత్వం మహిళలకు అత్యధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. ప్రజాసమస్యలపై రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వంపై బీజేపీ పోరాటం చేస్తుందన్నారు. గతంలో కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో వచ్చిపోయే కరెంటు, నీటి ఎద్దడి లేకపోవడంతో ప్రజలు, రైతులు అనేక ఇబ్బందులు పడ్డారని అన్నారు. ఇళ్లు లేని పేదలకు ఇళ్ల నిర్మాణానికి గ్రామీణ ప్రాంతాల్లో ఐదు లక్షలు, పట్టణ ప్రాంతాల్లో ఏడు లక్షల చొప్పున నిధులు కేటాయించి నాలుగు కోట్ల మందికి ఇళ్లు కట్టించిన ఘనత నరేంద్ర మోడీది అని అన్నారు. అందుకే దేశంలో మూడోసారి బీజేపీ ప్రభుత్వానికి ఓటు వేసేందుకు సిద్ధం కావాలని ఈటెల రాజేందర్ పిలుపునిచ్చారు.

## ఇంటిని ఢీ కొట్టిన కారు.. ఇద్దరు మృతి, మరో ఇద్దరికి తీవ్రగాయాలు

నల్గొండ, మార్చి 2 :అదుపుతప్పి ఇంటిని కారు ఢీకొట్టి ఇద్దరు మృతిచెందగా, మరో ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన శనివారం తెల్లవారుజామున చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్ వయా జనగామ నుంచి విజయవాడ దైవదర్శనానికి కారులో నలుగురు వెళ్తుండగా సూర్యాపేట జిల్లా తిరుమలగిరి మున్సిపాలిటీ కేంద్రంలోని పాత గ్రామంలో బాబర్ ఐరన్ షాప్ సమీపంలో కారు అదుపుతప్పి పాత ఇంటిని ఢీకొట్టింది.

అందులో ప్రయాణిస్తున్న విక్రమ్, రమేష్ లకు తీవ్రగాయాలు కాగా.. వారిని ప్రైవేట్ అంబులెన్స్ లో సూర్యాపేట ప్రభుత్వ హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందారని తెలిపారు.



# ఖాళీ స్థలాలను మురికి కూపాలుగా మారుస్తున్న స్థలాల యజమానులు

**-స్థల యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలి**
**-పరిశుభ్రంగా ఉంచే బాధ్యత జీహెచ్ఎంసీ తీసుకోవాలి.**
**-ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ డిమాండ్.**

హైదరాబాద్ మార్చి 2 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: ఖాళీ స్థలాల పట్ల స్థలాల యజమానులు పూర్తి నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో ఆయా స్థలాల్లో పేరుకుపోతున్న చెత్త కుప్పల కారణంగా నగర వ్యాప్తంగా భూగర్భ జలాలు పెను ప్రమాదంలో పడే పరిస్థితి నెలకొందని' దీనివల్ల పర్యావరణానికి తీవ్ర ముప్పు వాటిల్లుతోందని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ ఆవేదన వ్యక్తం చేసింది. తక్షణమే ఆయా కాళీ స్థలాలు పరిశుభ్రంగా ఉంచేలా స్థల యజమానులపై ఒత్తిడి పెంచడమా ! లేక వారి వద్ద నుంచి రుసుము వసూలు చేసి జిహెచ్ఎంసి ఆ బాధ్యతను తీసుకోవటమా ..?? ఏదో ఒకటి చేయాలని ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ అధ్యక్షులు రంగయ్య డిమాండ్ చేశారు. శనివారం ఆయన బాగ్లింగంపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ.... గతంలో ఖాళీ స్థలాల అపరిశుభ్రతపై జిహెచ్ఎంసి మేయర్, పలువురు అధికారులకు ఫిర్యాదు చేసిన నేపథ్యంలో వాటిపై దృష్టి సారించిన్నట్లు పేర్కొన్నారు. అయితే జిహెచ్ఎంసి సిబ్బంది ఇటీవల కాలంలో కాడి దించినట్లు కనిపిస్తోందని ఆరోపించారు. దీంతో మళ్ళీ ఆయా కాళీ స్థలాలు మురికి కూపాలుగా మారి భూగర్భ జలాల కలుషితంతో పాటు స్థానికంగా పారిశుధ్య సమస్యలను లేవనెత్తుతు న్నాయని రంగయ్య ఆవేదన వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల కోర్టు వివాదాల కారణంగా, మరి కొన్నిచోట్ల యజమా నుల నిర్లక్ష్యం కారణంగా స్థలాల్లో చెత్త, ప్లాస్టిక్ మేటలు వేస్తున్నాయని పేర్కొన్నారు. కారణమే దైనా ఆయా స్థలాలను నిరంతరం పరిశుభ్రంగా ఉంచాల్సిన అవసరం జీహెచ్ఎంసీ పైన, యజమానులపై ఉందని, అలాంటి నిర్లక్ష్యాన్ని వహించే యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సిన అవసరం ఉందని రంగయ్య అభిప్రాయపడ్డారు. రోజురోజుకు మహానగరలో రకరకాల కాలుష్యాల బెడద తీవ్రమవుతున్న నేపథ్యంలో ఇలాంటి నిర్లక్ష్యాలు పెను ప్రమాదాలను సృష్టిస్తాయన్నారు. ఈ నేపథ్యంలో జిహెచ్ఎంసి ఉన్నతాధికారులు, పురపాలక శాఖ వర్గాలు ఈ సమస్యపై తక్షణమే దృష్టి సారించాలని ఆయన కోరారు. చెత్త, ప్లాస్టిక్ దిబ్బల కారణంగా మాల మూత్ర విసర్జన కూడా జరుగుతోందని, దానివల్ల ఆయా ప్రాంతాలు దుర్గంధం ఆక్రమించడమేగాక వర్షాల కారణంగా మురుగునీరు భూమిలోకి ఇంకి భూగర్భ జలాలు తీవ్రస్థాయిలో కాలుష్యానికి గురయ్యే ప్రమాదం పొంచి ఉందన్నారు. సామాన్య జనం వీటివల్ల మాయ రోగాల భారిన పడుతున్నారని, స్వచ్ఛతకు పెద్దపీట వేస్తున్న కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ఈ రకమైన నిర్లక్ష్యాన్ని ఏమాత్రం సహించరాదని ఆయన డిమాండ్ చేశారు. రోజురోజుకు కాలుష్య కాసారంలో నగర సమాజం రోగగ్రస్తమవుతున్న తరుణంలో ఇలాంటివి పెను విపత్తులు సృష్టించక ముందే చట్టబద్ధంగా కఠిన నిర్ణయాలు తీసుకోవడమే ఉత్తమమని ఆయన అభిప్రాయపడ్డారు. భూగర్భ జలాలు తీవ్రస్థాయిలో కలుషితం కావడానికి కూడా ఈ రకమైన ఖాళీ స్థలాల నిర్వాకమే కారణమని పలువురు విశ్లేషకులు పేర్కొంటున్న నేపథ్యంలో అధికారులు ఉక్కు పాదం మోపాల్సిన అవసరం ఉందని, అధికారులు నిర్లక్ష్యాన్ని, మెతక వైఖరి వీడాలని రంగయ్య హితవుం లికారు. మన సమాజాన్ని మనమే రక్షించుకోవడమే ఎన్విరాన్మెంట్ ప్రొటెక్షన్ డెవలప్మెంట్ కౌన్సిల్ పిలుపు అని ఆయన పేర్కొన్నారు.

# సంగారెడ్డి ఐపీఓడబ్ల్యూ నూతన కమిటీ ఏర్పాటు

**-జిల్లా ప్రసిడెంట్ గా సి.సంతోషా, కార్యదర్శిగా లలితక్క ఏకగ్రీవంగా ఎన్నిక**




సంగారెడ్డి మార్చ్ 2 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); ఐపీఓడబ్ల్యూ సంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో జరిగిన అంతర్జాతీయ శ్రామిక మహిళా దినోత్సవ కార్యక్రమంలో జిల్లా నూతన కమిటీ ఏర్పాటు అయ్యింది. ముఖ్య అతిథిగా హాజరైన సిపిఐ(ఎం.ఎల్) చంద్రపుల్లారెడ్డి కేంద్ర కమిటీ కార్యదర్శి మల్లెపల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో ఐపీఓడబ్ల్యూ జాతీయ కన్వీనర్ సంపంగి పద్మ, రాష్ట్ర కార్యదర్శి పెర్క సునీత అధ్యక్షతన జరిగిన కార్యక్రమం లో సంగారెడ్డి జిల్లా కేంద్రం, బైపాస్ రోడ్డులో సభలో ఐపీఓడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలిగా సి.సంతోష్, కార్యదర్శిగా లలితక్క, సభ్యులుగా కవిత, లక్ష్మీ, అనిత, శీత, సుజాత, బి.లక్ష్మీ, కళావతి తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికయిన సభ్యులచేత సంఘం ఆశయాలు, లక్ష్యాల సాధనకు నిర్మాణాత్మకంగా వనిచేస్తామని ప్రతినబూనారు.

# కాంగ్రెస్ ఇచ్చిన ఆరు గ్యారంటీలను పక్కాగా అమలు చేస్తాం.. ఎమ్మెల్యే భూపతి రెడ్డి



నిజామాబాద్, మార్చి 2:నిజామాబాద్ జిల్లా డిచ్ పల్లి మండలం నడిపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయంలో గృహ జ్యోతి పథకాన్ని నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి ప్రారంభించారు. లబ్ధిదారులకు కరెంట్ జీరో బిల్లును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 200 యూనిట్లు ఉచిత కరెంట్ అసాధ్యమని బీజేపీ, భారాస నాయకులు అన్నారు.. ఇప్పుడు ప్రజలకు ఏం సమాధానం చెప్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను పక్కా అమలు చేస్తామని వెల్లడించారు.

ప్రతి గ్యారెంటీని ప్రతి ఇంటికి ఇచ్చే బాధ్యత కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉందన్నారు. గత కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నీటిమూటలయ్యాయి తప్ప.. ఎవరికీ లబ్ధి చేరలేదన్నారు. నల్గొండ సభలో కేసీఆర్ మేడిగడ్డ బొందల గడ్డ అక్కడ ఏముంది అన్నాడు.. మరి కేటీఆర్ ఎందుకు వెళ్ళాడు బొందలు చూడడానికా అని ప్రశ్నించారు.. గ్యాస్ సిలిండర్ ఎంత ధర ఉన్నా 500 రూపాయల రాయితీ ఇస్తామన్నారు. మిగతా డబ్బులను 48 గంటల్లో లబ్ధిదారుల ఖాతాలో జమ చేస్తామన్నారు. 2లక్షల రుణమాఫీ, రైతు భరోసా త్వరలో అమలు చేస్తామన్నారు. పంట పండించే రైతుకు, కౌలు రైతులకే రైతు భరోసా తప్ప రోడ్లకు, గుట్టలకు చెరువులకు ఇవ్వమని తెలిపారు.. బీజేపీ 10సంవత్సరాల్లో చేసింది ఏమి లేదు.. హిందూ ధర్మం అంటూ ఓట్ల వ్యాపారం చేశారు.. ఎంపీ అర్వింద్ అనుభవిస్తున్న ప్రతి రూపాయి కాంగ్రెస్ పార్టీదే, ముందు పసుపు బోర్డ్ ఎక్కడ ఉందో చూపించాలన్నారు. బీజేపీ, భారాస ఒక్కటే అన్నారు.

# పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

హైదరాబాద్, మార్చి 2 :పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని నాగార్జునసాగర్ ఎమ్మెల్యే కుందూరు జయవీర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం అనుముల గ్రామంలో గృహజ్యోతి పథకాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా విద్యుత్ జీరో బిల్లులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత శాసనసభ ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో భాగంగా గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందజేయనున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎస్ఈ చంద్రవెహాన్‌తో పాటు మున్సిపల్ కౌన్సిలర్లు చంద్రారెడ్డి, ప్రసాద్‌నాయక్, పిల్లి చంద్రకళ ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు కర్నాటి లింగారెడ్డి, కాకునూరి నారాయణగౌడ్, తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, గౌని రాజారమేశ్ పాల్గొన్నారు.

# అందుబాటులో ఉన్న విద్యుత్‌ను పూర్తి స్థాయిలో వినియోగించుకునేలా చూసేందుకు విద్యుత్ నియమాలు 2022ను సవరించిన కేంద్ర ప్రభుత్వం

న్యూఢిల్లీ, మార్చి 2:దేశంలో పెరుగుతున్న డిమాండ్‌కు తగ్గట్లుగా విద్యుత్ సరఫరా ఉండేలా చూసేందుకు, భారత ప్రభుత్వం విద్యుత్ (ఆలస్య చెల్లింపు సర్‌ఛార్జ్ ఒ సంబంధిత విషయాలు) 2022 నిబంధనలను సవరించింది. ఈ సవరణలు, విద్యుత్ సరఫరా విషయంలో వినియోగదార్లలో విశ్వసనీయత పెంచుతాయి.

సవరణల గురించి వివరించిన కేంద్ర విద్యుత్ శాఖ మంత్రి శ్రీ ఆర్.కె. సింగ్, మిగులు విద్యుత్‌కు సంబంధించి కీలక సవరణలు చేసినట్లు వెల్లడించారు. కొన్ని విద్యుత్ ఉత్పత్తి కంపెనీలు మిగులు విద్యుత్‌ను మార్కెట్‌కు అందించడం లేదని, ఫలితంగా, ఉపయోగించని విద్యుత్ జాతీయ స్థాయిలో పెరిగిందని చెప్పారు.

ఈ సమస్యను పరిష్కరించడానికి, అందుబాటులో ఉన్న విద్యుత్‌ను సంపూర్ణంగా వినియోగించుకునేలా చూడడానికి విద్యుత్ నిబంధనలకు కేంద్ర ప్రభుత్వం సవరణలు చేసింది. ఆ సవరణల ప్రకారం, మిగులు విద్యుత్‌ను మార్కెట్‌కు అందించని విద్యుత్ ఉత్పత్తి సంస్థలు ఆ మిగులుకు అనుగుణంగా స్థిర ఛార్జీలను క్లెయిమ్ చేయలేవు. దీంతోపాటు, మిగులు విద్యుత్‌ను విద్యుత్ ధరలో 120% కంటే ఎక్కువకు ధరకు (విద్యుత్ ధర + పంపిణీ వ్యయం కలిపి) విక్రయించకూడదు. దీనివల్ల మిగులు విద్యుత్‌ను కొనుగోలు చేసి వినియోగించుకునే అవకాశం పెరుగుతుంది.

జాతీయ విద్యుత్ గ్రిడ్ వినియోగానికి సంబంధించిన నిబంధనల్లోనూ సవరణలు జరిగాయి. చెల్లింపుల్లో ఆలస్యం కారణంగా తక్కువ యాక్సెస్ వంటి ఇబ్బందులు ఎదుర్కొంటున్న పంపిణీ సంస్థలు, తమ బకాయిలను తీర్చిన తర్వాత జాతీయ గ్రిడ్‌ను త్వరగా యాక్సెస్ చేసుకునేలా ఈ సవరణలు దోహదపడతాయి.

ప్రధానంగా, విద్యుత్ ఉత్పత్తి సంస్థలు ఒ పంపిణీ సంస్థలు ఎదుర్కొంటున్న నగదు సంబంధిత సమస్యలను పరిష్కరించడానికి, సకాలంలో చెల్లింపులను ప్రోత్సహించడానికి 2022లో విద్యుత్ (ఆలస్య చెల్లింపు సర్‌ఛార్జ్ ఒ సంబంధిత విషయాలు) నియమాలను తీసుకొచ్చినట్లు విద్యుత్ శాఖ మంత్రి వెల్లడించారు. ఆ నోటిఫికేషన్ తర్వాత బకాయిలు తీర్చడంలో గణనీయమైన పురోగతి కనిపించింది. చాలా పంపిణీ సంస్థలు ఇప్పుడు ఆలస్యం లేకుండా చెల్లింపులు చేస్తున్నాయి. మొత్తం చెల్లించని బిల్లులు 2022 జూన్‌లో దాదాపు రూ.1.4 లక్షల కోట్లుగా ఉంటే, 2024 ఫిబ్రవరి నాటికి అవి దాదాపు రూ.48,000 కోట్లకు తగ్గాయి.

# అండాళమ్మకు సంతాపం తెలిపిన ఎంపీ వద్దిరాజు



ఖమ్మం, మార్చి 2 :(నేటినిజం ప్రతినిధి): తన సహచర ఎంపీ దీవకొండ దామోదర్ రావు మాతృమూర్తి అండాళమ్మ మృతి పట్ల రాజ్యసభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. సమాచారం తెలిసిన వెంటనే శనివారం ఉదయం బంజారాహిల్స్ లోని దామోదర్ రావు నివాసానికి వెళ్లి అండాళమ్మ భౌతికకాయాన్ని సందర్శించి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఎంపీ దామోదర్ రావు, వారి కుటుంబ సభ్యులు, బంధుమిత్రులను రవిచంద్ర పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అండాళమ్మ పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేత కే.కేశవరావు, మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు, రాజ్యసభ సభ్యులు జోగినపల్లి సంతోష్ కుమార్, కే.ఆర్.సురేష్ రెడ్డి తదితర ప్రముఖులు అండాళమ్మ భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించారు. ఆమె కుమారుడు దామోదర్ రావు, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

# పరిశుభ్రత కార్యక్రమాల్లో అగ్రపథాన విజయవాడ





న్యూఢిల్లీ, మార్చి 2:పరిశుభ్రత కార్యక్రమాల్లో విజయవాడ నగరం వేగంగా ఎదుగుతోంది, దేశంలోని అగ్రగామి నగరాల సరసన చోటు నిలుపుకుంది. పట్టణ పారిశుద్ధ్యంలో ప్రమాణాలను కచ్చితంగా పాటించడం, అంకితభావం ఒ సంఘటితంగా పని చేసిన ప్రయత్నాలకు ఈ సానుకూల ఫలితం దక్కింది. 'స్వచ్ఛ సర్వేక్షణ్ 2023' పరిశుభ్రత నగరాల ర్యాంకుల్లో విజయవాడ మున్సిపల్ కార్పొరేషన్ (వీఎంసీ) 6వ స్థానాన్ని సాధించింది. మిలియన్ల జనాభా ఉన్న బెజవాడలో రోజుకు 520 టన్నుల (టీపీడీ) వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. వీటిని నిర్వహించడానికి దాదాపు 4,000 మంది పారిశుధ్య కార్మికులు, 300 తడి వ్యర్థాల కార్మికులతో బలమైన కార్మిక బలం విజయవాడలో ఉంది. పొడి చెత్త నిర్వహణ కోసం ఒక ఎంఆర్ఎఫ్ కేంద్రం, 'చెత్త నుంచి విద్యుత్' ఉత్పత్తి కేంద్రం సహా అధునాతన శుద్ధి సౌకర్యాలు కార్పొరేషన్‌లో ఉన్నాయి. వీఎంసీలో ఆరు వర్మీకంపోస్ట్ కేంద్రాలు, నాలుగు విండ్రో కంపోస్ట్ ప్లాంట్లు, ఒక బయో-మెథనేషన్ ప్లాంట్ ఉన్నాయి. ప్రమాదకర ఒ శానిటరీ వ్యర్థాల నిర్వహణ కేంద్రం కూడా బెజవాడలో ఉంది. ముఖ్యంగా, పూల వ్యర్థాలు, కొబ్బరిబోండాల వ్యర్థాలు, ఉద్యానవన వ్యర్థాలను శుద్ధి చేయడానికి కూడా కేంద్రాలను ఏర్పాటు చేశారు.

వీఎంసీలో ఏర్పాటు చేసిన బయో-మెథనేషన్ కేంద్రంతో తక్కువ ఖర్చుతో, అత్యంత ప్రభావవంతంగా తడి వ్యర్థాలను శుద్ధి చేయవచ్చు. బయో-మెథనేషన్ కేంద్రం రోజుకు 16 టన్నుల తడి వ్యర్థాలను ప్రాసెస్ చేస్తుంది. వ్యర్థాల నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించడానికి, సమీకృత ఘన వ్యర్థాల నిర్వహణ కేంద్రంలో సమాచార పార్కును ఏర్పాటు చేయాలని కూడా వీఎంసీ భావించింది. ఇక్కడ, కార్పొరేషన్ చేపడుతున్న పారిశుద్ధ్య కార్యక్రమాలు, ప్రయత్నాల వివరాలను ప్రదర్శిస్తారు.

విజయవాడలో నిర్మాణాలు, కూల్చివేతల నుంచి రోజుకు 47 టన్నుల వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయి. 200-టీపీడీ సామర్థ్యం గల శుద్ధి కేంద్రానికి వాటిని పంపుతారు. ఆ వ్యర్థాలను ఇటుకలు ఒ పేవర్ బ్లాకులుగా మార్చి నివాస ఒ వాణిజ్య ప్రాంతాల్లో ఉంచుతారు. తద్వారా ప్రజలు నడవడానికి, వీధి వ్యాపారుల కోసం వ్యవస్థీకృత ప్రాంతాలను అందిస్తారు. నగరంలో ఎప్పటి నుంచో ఉన్న వ్యర్థాల నిల్వ ప్రాంతాలను వీఎంసీ తొలగించింది. బయో మైనింగ్ ప్రక్రియ ద్వారా 2.5 లక్షల టన్నుల చెత్తను అక్కడి నుంచి తీసేసింది. దీనివల్ల అందుబాటులోకి వచ్చిన 25 ఎకరాల భూమిలో పార్కును ఏర్పాటు చేశారు. మిగిలిన ప్రాంతంలో సమీకృత ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ కేంద్రాన్ని స్థాపించారు, థర్మల్ ప్రాసెసింగ్ సౌకర్యం కూడా ఉంది.

విజయవాడలోని మూడు శాశ్వత ఆర్ఆర్ఆర్ కేంద్రాలను స్వయం సహాయక సంఘాల మహిళలను నిర్వహిస్తున్నాయి. సేకరించిన వ్యర్థాలను టేబుళ్లు, కుర్చీలు, హ్యాండ్‌బ్యాగ్‌లు, ఇతర వస్తువులుగా మహిళా సభ్యులు మారుస్తారు. వాటిని ప్రజలకు విక్రయిస్తారు. వ్యర్థాలు, ఉపయోగించని వస్తువులను విరాళంగా ఇచ్చేలా పౌరులను ప్రోత్సహించేందుకు 'వాల్ ఆఫ్ కైండ్‌నెస్', ప్లాస్టిక్ సేకరణ కేంద్రాలు ఏర్పాటయ్యాయి.

విజయవాడలో రోజుకు 132 మిలియన్ లీటర్ల మురుగునీరు ఉత్పత్తి అవుతోంది. భూగర్భ మురుగునీటి పైప్‌లైన్ల ద్వారా ఆ నీటిని ఆరు మురుగునీటి శుద్ధి కర్మాగారాలు (ఎన్‌టీపీలు), సహ-శుద్ధి కర్మాగారానికి పంపుతారు. ఈ నెట్‌వర్క్ సామర్థ్యం 140 ఎంఎల్‌డీ. శుద్ధి చేసిన నీటిని వ్యవసాయ పనులు, రోడ్లను శుభ్రపరచడం, చెట్లకు నీరు పెట్టడం కోసం వినియోగిస్తారు. కాల్వలు ఎక్కువగా ఉన్న విజయవాడలో, కాలువ గట్ల నుంచి 6,000 టన్నుల వ్యర్థాలను వీఎంసీ విజయవంతంగా తొలగించింది.

యూఎల్‌బీ, పౌరుల ఉమ్మడి ప్రయత్నాలతో, సమర్థవంతమైన వ్యర్థాల నిర్వహణ ఒ పారిశుధ్య పద్ధతులకు విజయవాడ చక్కటి ఉదాహరణగా నిలుస్తోంది.

# పిల్లల ఆరోగ్యానికి భరోసా ఇస్తున్న 'రాష్ట్రీయ బాల స్వస్థ్య కార్యక్రమం': డా.వి.కె. పాల్




న్యూఢిల్లీ, మార్చి 2:"ప్రధాన్ మంత్రి జన్ ఆరోగ్య యోజన అనేది భారతదేశంలో సగం మంది ఆరోగ్యాన్ని సంరక్షించే పథకం. ఇప్పటికే ఉన్న 'రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమం'తో పాటు పిల్లల ఆరోగ్యం మెరుగుదల కోసం ఇది పని చేస్తుంది" అని నీతి ఆయోగ్ సభ్యుడు (ఆరోగ్యం) డా.వి.కె. పాల్ చెప్పారు. ఆరోగ్యం ఒ కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అపూర్వ చంద్ర సమక్షంలో, 'జాతీయ జనన లోపాల అవగాహన నెల 2024'ను ఆయన ప్రారంభించారు. 'జాతీయ జనన లోపాల అవగాహన నెల 2024' నేపథ్యాంశం "అడ్డుగోడలను బద్ధలు కొడదాం: జనన లోపాల పిల్లలకు సంపూర్ణ మద్దతునిద్దాం". పుట్టుకతో వచ్చే లోపాలను ముందుగానే గుర్తించడం ఒ సకాలంలో నిర్వహణ ఈ ప్రచారం ఉద్దేశం.

'రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమం' పిల్లల ఆరోగ్యం కోసం విశేషంగా కృషి చేస్తోందని డా.పాల్ ప్రశంసించారు. ఈ కార్యక్రమం కింద 160 కోట్ల మంది పిల్లలను పరీక్షించారని, ఇది పిల్లల ఆరోగ్యానికి ఇచ్చిన భరోసా అని చెప్పారు. ఆర్‌బీఎస్‌కేను విజయవంతంగా అమలు చేయడం కోసం సంచార ఆరోగ్య బృందాలు, జిల్లా స్థాయి ముందస్తు జోక్యాల బృందాలు పని చేస్తున్నాయన్న డా.పాల్, చిన్నారుల ఆరోగ్యానికి భరోసా ఇవ్వడం, మారుమూల ప్రాంతాల్లోకి సైతం వెళ్లడం కోసం ఆ బృందాలు చేస్తున్న ప్రయత్నాలను అభినందిం చారు.

మలేరియా, న్యుమోనియా, ఇతర వ్యాధుల వల్ల సంభవించే మరణాలతో పోలిస్తే జనన లోపాల మరణాల నిష్పత్తి తక్కువగా ఉన్నప్పటికీ, పిల్లల మరణాల రేటును తగ్గించడానికి పుట్టుకతో వచ్చే లోపాలను పరిష్కరించాల్సిన అవసరం ఉందని డా.పాల్ చెప్పారు. "రాష్ట్రీయ బాల్ స్వస్థ్య కార్యక్రమం కింద పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యాన్ని సాధించడం మా ప్రాధాన్యత. 'జాతీయ జనన లోపాల అవగాహన నెల 2024' ప్రచారం దీనిపై అవగాహన పెంచుతుంది. పుట్టుకతో వచ్చే లోపాల సమస్యను పరిష్కరించడానికి మరింత కవరేజీని అందించాల్సిన అవసరం ఉంది" అని అన్నారు.

పిల్లలు పుట్టుకతో వచ్చే లోపాల బారిన పడకుండా నిరోధించడానికి, వాళ్లను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దడానికి పీజీ స్థాయిలో పిడియాట్రిక్స్‌ను ఎంచుకోవాలని డా.వి కె పాల్ విద్యార్థులను కోరారు. "పిల్లలకు పుట్టుకతో వచ్చే లోపాలు ఉంటే ఆ కుటుంబం కూడా ఆందోళన చెందుతుంది. ఈ ప్రచారం ద్వారా వాటిని పరిష్కరిస్తాం" అని చెప్పారు. "ముఖ్యంగా న్యూరల్ ట్యూబ్ డిఫెక్ట్ (ఎన్‌టీడీలు) కోసం, ఫోలిక్ యాసిడ్ అనుబంధ విధానం చక్కగా పని చేస్తుంది. ఫోలిక్ యాసిడ్ అనుబంధాలను ఉన్నత స్థాయికి తీసుకెళ్లాల్సిన సమయం ఆసన్నమైంది. గర్భధారణకు ముందు సంరక్షణ అనేది స్త్రీకి చాలా ముఖ్యం. పోషకాహార స్థితి, బీఎంఐ, థైరాయిడ్, యూటీఐ వంటివి కూడా జాగ్రత్తగా చూసుకోవాలి, ఇది ఆరోగ్యకరమైన ప్రసవానికి సాయపడుతుంది" పుట్టుకతో వచ్చే లోపాలు, ముఖ్యంగా దొడ్డి కాళ్లు, వినికిడి లోపాలు, కంటి సమస్యలు, గ్రహణంమొర్రి వంటివి పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తాయి. వాటిని ముందుగానే గుర్తించాలని కేంద్ర ఆరోగ్య శాఖ కార్యదర్శి శ్రీ అపూర్వ చంద్ర స్పష్టం చేశారు.

# రక్షణ రంగంలో ఆత్మనిర్భరతకు మరింత ప్రోత్సాహం

న్యూఢిల్లీ, మార్చి 2: రక్షణలో ఆత్మనిర్భరతలో భాగంగా, మేక్ ఇన్ ఇండియా చొరవను మరింత బలోపేతం చేసేందుకు రక్షణ మంత్రిత్వ శాఖ రూ. 39, 125.39 కోట్ల విలువైన ఐదు ప్రధాన కాపిటల్ ఎక్విజిషన్ (మూలధన ప్రాప్తి) ఒప్పందాలపై 1 మార్చి 2024న న్యూఢిల్లీలో సంతకాలు చేసింది. రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్, రక్షణ కార్యదర్శి శ్రీ గిరిధర్ అరమణె మార్గదర్శనంలో ఈ వ్యవహారం ఫలవంతమైనందున, వారి సమక్షంలో ఈ ఒప్పందాలను ఇచ్చి పుచ్చుకున్నారు.

భారత రక్షణ దళాల కోసం చేసుకున్న ఐదు ఒప్పందాలలో, ఒకటి మిగ్-29 విమానాలకు ఎయిరో-ఇంజన్లను సేకరించేందుకు ఎం/ ఎస్ హిందుస్తాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్‌తో, క్లోజ్- ఇన్ వెపన్ సిస్టమ్ (సిఐడబ్ల్యుఎస్ - చొచ్చుకు వస్తున్న స్వల్పదూరం వెళ్ళగల క్షిపణులు, శత్రువిమానాలను గుర్తించి, నాశనం చేయడం కోసం ఉద్దేశించిన గురిపెట్టిన ఆయుధ వ్యవస్థ), హైపవర్ రాడార్ (హెచ్‌పిఆర్) సేకరణకు ఎం/ ఎస్ లార్సెన్ అండ్ టుబ్రోతో రెండు ఒప్పందాలు, బ్రహ్మోస్ క్షిపణులు, నౌకలపై మోహరించగల బ్రహ్మోస్ వ్యవస్థ సేకరణ కోసం ఎం/ ఎస్ బ్రహ్మోస్ ఎయిరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ (బిఎపిఎల్)తో రెండు ఒప్పందాలు చేసుకున్నారు.

ఈ ఒప్పందాలు మన దేశీయ సామర్థ్యాలను మరింత బలోపేతం చేసి, విదేశీ మారకాన్ని ఆదా చేయడమే కాకుండా, భవిష్యత్తులో విదేశీ మూలానికి చెందిన ఆయుధాల తయారీదారులపై ఆధారపడడాన్ని తగ్గిస్తుంది.

ఎం/ ఎస్ హిందుస్తాన్ ఎయిరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఎఎల్)తో మిగ్-29 విమానాల కోసం రూ. 5,249.72 కోట్ల వ్యయంతో ఆర్‌డి-33 ఎయిరో ఇంజిన్స్ ఒప్పందం చేసుకున్నారు. ఈ ఎయిరో ఇంజిన్లను హెచ్ఎఎల్ కోరాపుట్ డివిజన్ తయారు చేయనుంది. ఈ ఎయిరో ఇంజిన్లు మిగ్-29 ఫ్లీట్ (సమూహం) కార్యాచరణ సామర్థ్యాన్ని, అవశేష సేవా జీవితానికి కొనసాగించడానికి భారత వైమానిక దళం (ఐఎఎఫ్) అవసరాన్ని తీర్చగలవని భావిస్తున్నారు. ఈ ఎయిరో ఇంజిన్లను సాంకేతిక బదలాయింపు (ట్రాన్స్‌ఫర్ ఆఫ్ టెక్నాలజీ - టిఒటి), రష్యన్ ఒఇఎం నుంచి లైసెన్సుతో తయారు చేయనున్నారు. ఆర్‌డి-33 ఎయిరో ఇంజన్ల భవిష్యత్తు మరమ్మతు, సమగ్ర పరిశీలన (ఆర్‌ఒహెచ్) పనుల దేశీయ పరిమాణాన్ని పెంచడంలో సహాయ పడే అనేక అధిక విలువ కలిగిన కీలక భాగాల స్వదేశీకరణపై ఈ కార్యక్రమం దృష్టి సారిస్తుంది.

ఎం/ ఎస్ లార్సన్ టుబ్రో లిమిటెడ్‌తో సిఐడబ్ల్యుఎస్‌ల సేకరణ కోసం రూ. 7,668.82 కోట్ల విలువైన ఒపపందం చేసుకున్నారు. దేశంలో ఎంపిక చేసిన ప్రాంతాలలో అగ్ర వాయు రక్షణను సిఐడబ్ల్యుఎస్‌లు కల్పిస్తాయి. ఈ ప్రాజెక్టు ఎంఎస్ ఎంఈలు సహా భారతీయ అంతరిక్ష, రక్షణ, సంబంధిత పరిశ్రమల చురుకైన భాగస్వామ్యాన్ని ప్రోత్సహించి, బలోపేతం చేస్తుంది. ఈ ప్రాజెక్టు ద్వారా ఐదు సంవత్సరాల వ్యవధిలో ఏడాదికి సగటున 2,400మంది వ్యక్తులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పన జరుగుతుంది.

ఎం/ ఎస్ లార్సన్ఒ టుబ్రో లిమిటెడ్‌తో హెచ్‌పిఆర్ సేకరణ కోసం రూ. 5,700.13 కోట్ల విలువైన ఒప్పందం చేసుకున్నారు. ఇది ప్రస్తుతం ఐఎఎఫ్ వద్ద గల దూరగామి రాడార్ల స్థానంలో అత్యాధునిక నిఘా లక్షణాలు గల ఆధునిక, చురుకైన అపెర్చర్ ఫేజ్డ్ అర్రే ( క్రమబద్ధ ద్వార అమరిక) ఆధారిత హెచ్‌పిఆర్ వస్తుంది. ఇది చిన్నరాడార్ క్రాస్ సెక్షన్ (విభిన్నవర్గాల) లక్ష్యాలను గుర్తించే సామర్థ్యం కలిగిన అత్యాధునిక సెన్సార్ల ఏకీకరణతో ఐఎఎఫ్ భూసంబంధ వాయు రక్షణ సామర్థ్యాలను గణనీయంగా పెంచుతుంది. ఇది భారతదేశంలో ప్రైవేట్ రంగం ద్వారా నిర్మితమైన తొలి రాడార్ కనుక దేశీయ రాడార్ తయారీ సాంకేతికతను మరింత బలోపేతం చేసి, ప్రోత్సహిస న్తుంది. ఈ ప్రాజెక్టు కింద ఐదు సంవత్సరాల వ్యవధిలో ఏడాదికి సగటున 1000 మంది వ్యక్తులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి కల్పన జరుగు తుంది.

బ్రహ్మోస్ క్షిపణుల సేకరణ కోసం ఎం/ ఎస్ బ్రహ్మోస్ ఎయిరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ (బిఎపిఎల్)తో చేసుకున్న ఒప్పందం విలువ రూ. 19,518.65 కోట్లు. ఈ క్షిపణులను భారత నావికాదళ యుద్ధ సామాగ్రి, శిక్షణ అవసరాలను తీర్చేందుకు ఉపయోగిస్తారు. ఈ ప్రాజెక్టు దేశంలోని ఎంఎస్ ఎంఇలు సహా అనుబంధ పరిశ్రమలలో సుమారు 135 లక్షల పని దినాలను, జాయింట్ వెంచర్ సంస్థలో తొమ్మిది లక్షల పని దినాలను కల్పించనుంది.

నౌకలపై అమర్చే బ్రహ్మోస్ వ్యవస్థ సేకరణ కోసం ఎం/ ఎస్ బ్రహ్మోస్ ఎయిర్ స్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ (బిఎపిఎల్) తో రూ. 988.07 కోట్ల విలువైన ఒప్పందాన్ని చేసుకున్నారు.

